చిందేపల్లి గిరిజన కాలనీ పొలాల్లో
కోడి పందాలు

డ్రోన్‌కెమెరాల ద్వారా గుర్తింపు
30 సెల్ ఫోన్స్, 30 మోటార్‌సైకిళ్ళు స్వాధీనం

పోలీసుల్ని చూసి పరుగులు తీసిన సందెంరాయుళ్లు

వదలిపెట్టిన కోళ్ళు మోటార్ సైకిళ్ళు

శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 24 ప్రభాతవార్త

ఏర్పేడు మండలంలోని పలు గ్రామాల్లో విచ్చలవిడిగా కోడి పందెములు జరుగుతున్నట్లు వస్తున్న ఆరోపణలపై పోలీసులు డ్రోన్‌కెమెరాలను ఉపయోగిస్తున్నారు. ఆదివారం మండలంలోని జంగాల పల్లి, మద్దిలేడు, దుర్గిపేరి, శివగిరి కాలనీ,కాట్రకాయల గుంట,జంగాల పల్లి గిరిజన కాలనీల్లో డ్రోన్ కెమెరాలను ఉపయోగించి గుర్తిస్తున్నట్లు పోలీసులు వివరించారు. జిల్లా ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు ఏర్పేడు మండలంలో విచ్చల విడిగా జరుగుతున్న కోడిపందెముల శిబిరాలను గుర్తించుటకు స్పెషల్ పార్టీ టీం,సైబర్ క్రైం ఇన్సెపెక్టర్ డ్రోన్ కెమెరాల ఇన్‌చార్జి వినోద్‌కుమార్ పర్యవేక్షణలో 10మంది పోలీసుల సిబ్బంది కోడి పందాలను నిర్వహించు వారిపై ఏక కాలంలో దాడులు నిర్వహించారు. పోలీసు సిబ్బందిని చూసిన కోడి పందాలు ఆడేవారు, కోడి పందాల నిర్వహకులు పోలాల్లోకి పరుగు పెట్టారు. డ్రోన్ కెమెరాలతో గుర్తించిన సిబ్బంది నిర్వాహకులు,ఆటగాళ్ళను పరుగులు తీయించారు. 25 మ దిని అదుపులో తీసుకున్నట్లు పోలీసులు వివరించారు. పట్టుబడ్డ వారిని ఏర్పేడు పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఏర్పేడుమండలంలోని చిందేపల్లి ఎస్‌టి కాలనీకి చెందిన రైతుల పొలాల్లో గుంపులుగా చేరి పందాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వీరి నుంచి11 కోడి పుంజులు,రూ.61,116లు నగదు,29 సెల్‌ఫోన్లు,30 మోటార్‌సైకిళ్ళు 12 కోడి కత్తులుస్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులు కోడి పందాలు ఎక్కడ నిర్వహించినా ఆడినా అలాంటివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

అమ్మవారి దర్శించిన పార్లమెంట్ కమిటీ సభ్యులు

తిరుచానూరు, ఆగస్టు 24, ప్రభాతవార్త

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి సేవలో పార్లమెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. వీరిని ఆలయ అధికారులు స్వాగతించి దర్శనం ఏర్పాట్లు చేశారు. ముందుగా ధ్వజస్తంభం నమస్కరించి అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. తర్వాత ఆశీర్వాద మండపం వద్ద ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీ వాణి, ఇన్స్పెక్టర్ చలపతి, ఏవీఎస్ఒ రాధా కృష్ణమూర్తి పాల్గొన్నారు.

జిల్లా టిడిపి అధ్యక్ష పదవికి పోటాపోటీ!!

పోతుగుంట విజయబాబు, ఎన్‌పి జయప్రకాష్, కాజూరు బాలాజీ

- పదవి కోసం నేతలు తీవ్ర ప్రయత్నాలు
- నేడు ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ ఛైర్మన్లతో త్రిసభ్య కమిటీ అభిప్రాయ సేకరణ

చిత్తూరు, ఆగస్టు 24 ప్రభాతవార్త:

జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవి దక్కించుకోవడానికి పార్టీ నాయకుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ప్రస్తుతం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా వున్న సిఆర్ రాజన్ స్థానంలో కొత్తవారిని ఎంపిక చేయాలని పార్టీ అధిష్టానం నిర్ణయించడంతో పార్టీలో బలమైన రెండు సామాజిక వర్గాలకు చెందిన నాయకులు ఈ సారి ఎలాగైనా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవిని దక్కించుకోవాలని తమ వంతు ప్రయత్నాలను ముమ్మరంగా చేస్తున్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవి ఎవరికి కట్టబెట్టాలనే విషయంపై అభిప్రాయ సేకరణ చేసి పార్టీ అధిష్టానానికి నివేదిక సమర్పించడానికి పార్టీ అధిష్టానం నియమించిన త్రిసభ్య కమిటీ సభ్యులు సోమవారం చిత్తూరుకు వస్తున్నారు. ఈ కమిటీలో సభ్యులుగా వున్న ఆర్‌అండ్‌బి శాఖ మంత్రి బిసీ జనార్దన్‌రెడ్డి(నంద్యాల), ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, లిడ్‌క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యాలరావు(గుంటూరు)లు జిల్లాకు చెందిన పార్టీ ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, పార్టీకి చెందిన ఇతర ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులతో జిల్లా పార్టీ అధ్యక్ష పదవి ఎవరికి కట్టబెట్టాలనే విషయంపై అభిప్రాయసేకరణ చేయనున్నారు.

ఎన్నికల అనంతరం రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో జిల్లా పార్టీ అధ్యక్ష పదవిని చేజిక్కించుకోవడానికి పార్టీలోని రెండు సామాజిక వర్గాలకు చెందిన నాయకులు ప్రయత్నాలు తీవ్రం చేశారు. పార్టీలోని ఒక బలమైన సామాజికవర్గం తమకు జిల్లా కేంద్రసహకార బ్యాంకు ఛైర్మన్ పదవి లభిస్తుందని అప్పుడు జిల్లా పార్టీ అధ్యక్ష పదవి మరొక సామాజిక వర్గానికి చెందిన వారికి ఇవ్వవొచ్చు అని భావించింది. అయితే పార్టీ అధిష్టానం రెడ్డి సామాజిక వర్గానికి డిసిసిబి ఛైర్మన్ పదవిని కట్టబెట్టడంతో ప్రస్తుతం పార్టీలో బలమైన రెండు సామాజిక వర్గాల నేతలు జిల్లా పార్టీ అధ్యక్ష పదవి కోసం సర్వశక్తులు వొడ్డుతున్నారు. నగరి నియోజకవర్గం నుండి సీనియర్ తెలుగుదేశం నాయకుడు పోతుగుంట విజయబాబు జిల్లా పార్టీ అధ్యక్ష పదవి కోసం శ్రమిస్తున్నారు. 2000 సంవత్సరంలోనే పోతుగుంట విజయబాబు జిల్లా తెలుగుయువత అధ్యక్షుడిగా పని చేశారు. అప్పట్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోదరుడు నారా రామ్మూర్తినాయుడితో సన్నిహితంగా మెలిగిన విజయబాబు ఆపై నారా కుటుంబంతో ఇప్పటికీ సత్సంబంధాలు కొనసాగిస్తున్నారు. నగరి నియోజకవర్గంలో అప్పట్లో మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమనాయుడు కాంగ్రెస్ పార్టీలో వుంటే విజయబాబు నగరి నియోజకవర్గంలో పార్టీని పటిష్టం చేయడానికి ఇతోధికంగా శ్రమించారు. గత నెలలో విద్యా శాఖ మంత్రి, భావి పార్టీ అధినేత నారా లోకేష్‌ను స్వయంగా కలిసి తన మనోభీష్టాన్ని ఆయన ముందుంచారు. జిల్లాలోని ఎమ్మెల్యేలందరికీ కలిసి మాట్లాడమని ఆయన ఆదేశాల మేరకు విజయబాబు ఎమ్మెల్యేలను కలిసి తన మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈయనతో పాటు డిసిసిబి చైర్మన్ పదవి కోసం తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఎలాగైనా జిల్లా పార్టీ అధ్యక్ష పదవి చేజిక్కించుకోవాలని బంగారుపాళ్యం మండల మాజీ అధ్యక్షుడు ఎన్‌పి జయప్రకాష్ గట్టిగా ప్రయత్నిస్తున్నారు. దీనికి పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌తో పాటు మరో ఇద్దరు ఎమ్మెల్యేలు మద్దతు ఇస్తున్నట్లు తెలిసింది. అలాగే జిడినెల్లూరు నియోజకవర్గం పాలసముద్రం మండలానికి చెందిన భీమినేని చిట్టిబాబునాయుడు సైతం జిల్లా పార్టీ అధ్యక్ష పదవి కోసం ప్రయత్నిసున్నారు. అయితే దీనికి ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ మోకాలొడ్డుతున్నారు. ఎన్నికలకు ముందు జి.డి.నెల్లూరు నియోజకవర్గం సమన్వయకర్తగా చిట్టిబాబుకు పార్టీ నియమించింది. అయితే అప్పట్లో నియోజకవర్గంలోని మండల అధ్యక్షులు, ఇతర కీలక నేతలు ఇతని నాయకత్వాన్ని బహిరంగంగా వ్యతిరేకించిన అంశం అధిష్టానం పరిశీలనలో వుంది. అలాగే చిత్తూరు నియోజకవర్గానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు చంద్రప్రకాష్ జిల్లా పార్టీ అధ్యక్ష రేసులో వున్నారు. ఇది వరకు చంద్రప్రకాష్ సతీమణి గీర్వాణి జడ్పీ ఛైర్‌పర్సన్‌గా విధులు నిర్వర్తించి వుండటంతో ఆ పరిచయాలతో తనను జిల్లా పార్టీ అధ్యక్ష పదవికి ప్రపోజ్ చేయాలని ఆయన పలువురు ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులను కలిసి కోరినట్లు తెలిసింది. ఇక పార్టీలోని మరొక ప్రధాన సామాజిక వర్గానికి చెందిన నాయకులు జిల్లా పార్టీ అధ్యక్ష పదవి తమకు కేటాయించాలని కోరుతున్నారు. జిల్లా కేంద్రం చిత్తూరులో ఇది వరకు ఎమ్మెల్యే తమ సామాజిక వర్గానికి చెందినవారు వుంటే జిల్లా పార్టీ అధ్యక్ష పదవి మరొక సామాజిక వర్గానికి వుండేదని, ప్రస్తుతం ఎమ్మెల్యే ఆ సామాజిక వర్గం వారు వుండటంతో జిల్లా పార్టీ అధ్యక్ష పదవి తమ సామాజిక వర్గానికి చెందినవారిని నియమించాలని ఆ సామాజిక వర్గ నాయకులు పేర్కొంటున్నారు. ఈ సామాజిక వర్గం నుండి జిల్లా పార్టీ అధ్యక్ష పదవి కోసం జిల్లా పార్టీ ఉపాధ్యక్షులుగా ప్రస్తుతం వున్న కాజూరు బాలాజీ ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. చిత్తూరు నుండి పార్టీ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేయడానికి ప్రయత్నిస్తే పార్టీ అధిష్టానం ప్రస్తుత ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడుకు అభ్యర్థిత్వం కేటాయించడంతో ఆయన గెలుపు కోసం కాజూరు బాలాజీ శ్రమించారు. ఎమ్మెల్యే గురజాల విజయం కోసం శ్రమించిన ప్రస్తుత జిల్లా పార్టీ అధ్యక్షుడు సిఆర్ రాజన్‌కు రాష్ట్ర వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి కట్టబెట్టగా, బాలాజీ సామాజిక వర్గానికి చెందిన కఠారి హేమలతను ప్రభుత్వం చుడా ఛైర్‌పర్సన్‌గా నియమించిన విషయం తెలిసిందే.

ఉపాధిహామీ పనులలో
ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతి

అధికారి హెచ్చరించినా..
తీరుమారని ఆ ఫీల్డ్ అసిస్టెంట్ వక్రబుద్ధి

తిరుపతిరూరల్,ఆగస్టు24 ప్రభాతవార్త:

తిరుపతిరూరల్ మండలంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులలో ఫీల్డ్ అసిస్టెంట్స్ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోఫణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈనెల 19న జరిగిన బహిరంగ సోషల్ ఆడిట్‌లో కొందరి ఫీల్డ్ అసిస్టెంట్స్ అవినీతి ఆరోఫణలపై బహిరంగ విచారణ చేయాలని డ్వామా పిడి శ్రీనివాస ప్రసాద్ అధికారులను ఆదేశించిన విషయం తెల్సిందే. ఈ విషయం మరువకమునుపే తిరుచానూరు ఫీల్డ్ అసిస్టెంట్ ఈనెల21న జరిగిన ఉపాధిహామీ పనులలో మూడు రకాల పనుల ఐడికి ఒకే ఫోటోను అప్‌లోడ్ చేసి చేతివాటాన్ని ప్రదర్శించింది. అలాగే ఈనెల 9న జరిగిన ఉపాధి పనులలోను, ఈనెల 22జరిగిన ఉపాధిపనులలో కూడా రెండు పనుల వర్క్‌ఐడికి ఒకే ఫోటోను అప్‌లోడ్ చేసి తన అవినీతి ధైర్యాన్ని ప్రదర్శించింది. ఉపాధిహామీలలో డిఫరెంట్ ఐడిలకు, డిఫరెంట్ పేర్లు కలిగిన మస్టర్స్‌కు ఒకే ఫోటోను అప్‌లోడ్ చేయడం ఆమె అవినీతి అత్యాశకు నిదర్శనం. తిరుపతిరూరల్ మండలంలో జరిగిన ఉపాధిహామీ పనులలో ఫీల్డ్ అసిస్టెంట్స్‌కు కూడా జాబ్ కార్డు ఉండటం గమనార్హం. ఫీల్డ్ అసిస్టెంట్‌కే కాదు...ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబ సభ్యులకు జాబ్ కార్డులు ఉన్నాయి. అంతే కాదు సాఫ్ట్‌వేర్ ఎంప్లాయిస్ పేర్లుపై, అటెండర్, స్వీపర్, కాంట్రాక్టు ఉద్యోగుల పేర్లుపై కూడా జాబ్ కార్డులు పెట్టుకుని వారంవారం డబ్బులు తీసుకోవడం వారి అవినీతి ప్రతిభకు నిదర్శనం. డ్వామా పిడి చెప్పినట్టుగా మహాత్మగాంధి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం..పేదోడి ముంగిట బంగారు బాతుగా వర్ణించారు. కానీ ఉపాధి పథకాన్ని తప్పుద్రోవ పట్టిస్తూ...ఫీల్డ్ అసిస్టెంట్స్ తమ ఇంటి బంగారు బాతుగా మల్చుకొంటున్నారు.

శివయ్యసేవలో హైకోర్టు జడ్జి

శ్రీకాళహస్తి,ఆగస్టు 24 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో ఆదివారం రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ లక్ష్మణరావు కుటుంబ సభ్యులతో హాజరయ్యారు.వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద ఎఇఒ మోహన్,సిఎస్ఒ నాగభూషణం యాదవ్‌లు స్వాగతం పలికారు. ఆలయంలోని స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు.రాహుకేతుదోష నివారణ పూజల నిర్వహణకు సంబంధించిన వివరాలను జస్టిస్ అడిగి తెలుసుకున్నారు. మృ త్యుంజయ ఆలయం వద్ద వారికి వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఎఇఒ మోహన్ వారికి స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు.

క్రీడాహబ్‌గా తిరుపతిని అభివృద్ధి చేస్తాం

- తిరుపతిలో 30 ఎకరాల్లో క్రీడాసదుపాయాలు కల్పించబోతున్నాం
- శాప్ ఛైర్మన్ రవినాయుడు ఆధ్వర్యంలో అమరావతి ఛాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీలు
- ప్రారంభించిన క్రీడాశాఖామంత్రి ఎంమ్. రాంప్రసాద్‌రెడ్డి
- ప్రత్యేక ఆకర్షణగా సినీహీరో నారా రోహిత్

తిరుపతి క్రీడ, ఆగస్టు 24, ప్రభాతవార్త

తిరుపతి జోన్‌ను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతామని, 30 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో క్రీడాసదుపాయాలను కల్పించబోతున్నామని క్రీడాశాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 29న జరగనున్న నేషనల్ స్పోర్ట్స్ డేను పురస్కరించుకుని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ఆధ్వర్యంలో తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ తారకరామా స్టేడియంలో నిర్వహించిన అమరావతి ఛాంపియన్షిప్ రాష్ట్రస్థాయి పోటీలను క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి, సినీ హీరో నారా రోహిత్ ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించిన అనంతరం క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. తొలుత ఆర్చరీ కోర్టును సందర్శించి యారోవిడిచి పెట్టడంతో పాటు రైఫిల్ షూటింగ్ పోటీల్లో పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్ రవినాయుడు అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ సభలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగించారు. తిరుపతిలో క్రీడారంగాన్ని ప్రోత్సహించే దానికి 30 ఎకరాల కేటాయించామన్నారు. రానున్న రోజుల్లో తిరుపతి నగరం కూడా క్రీడాహబ్‌గా మారనుందన్నారు. రాజధాని అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో స్పోర్ట్స్ సిటీని స్థాపిస్తున్నామన్నారు. మెగా డీఎస్సీ లో స్పోర్ట్స్ కోటా కింద 421 ఉద్యోగవకాశాలు కల్పిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యావ్యవస్థలో అనేక మార్పులను తీసుకొస్తున్నారన్నారు. రవినాయుడు మాట్లాడుతూ శాప్ చరిత్రలోనే జాతీయ క్రీడాదినోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా, క్రీడాకారులకు ప్రయోజనకంగా నిర్వహిస్తున్నామని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు వివరించారు. దానిలో భాగంగానే అమరావతి ఛాంపియన్‌షిప్ పేరుతో జిల్లాస్థాయి, జోనల్ స్థాయి పోటీలను ముగించుకుని రాష్ట్రస్థాయి పోటీలను ప్రారంభించామన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు మేజర్ ధ్యాన్‌చంద్‌ను స్మరించుకుంటూ ఈనెల 29వ తేదీన విశాఖపట్టణంలో జరిగే నేషనల్ స్పోర్ట్స్ డే వేడుకల్లో సీఎం చంద్రబాబునాయుడు చేతులు మీదుగా నగదు ప్రోత్సాహకాలు, పతకాలు అందజేస్తామనన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా నారా రోహిత్..

రాష్ట్రస్థాయి పోటీల ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి నారా కుటుంబం కృషి చేస్తుందని వివరించారు. జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ మాట్లాడుతూ నేషనల్ స్పోర్ట్స్ డేను పురస్కరించుకొని స్టేట్ లెవెల్ అమరావతి ఛాంపియన్షిప్ కార్యక్రమం తిరుపతిలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం శాప్ ఎండీ పీఎస్.గిరీషా మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలకు 1300 మంది క్రీడాకారులు హాజరయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ్ కార్పొరేషన్ ఛైర్మన్ నర్సింహా యాదవ్, తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డిగారు, హ్యాండ్ క్రాఫ్ట్స్ కార్పొరేషన్ ఛైర్మన్ హరిప్రసాద్, తిరుపతి డిప్యూటీ మేయర్ ఆర్సి.మునికృష్ణ, పుంగనూరు నియోజకవర్గ ఇన్చార్జి చల్లా బాబురెడ్డి, శాప్ డైరెక్టర్లు రమణారావు, రవీంద్రనాథ్, ఎండీ.రమేష్, పీబీవీఎస్ఎన్ బుచ్చిరాజు, కె.జగదీశ్వరి, సంతోష్ కుమార్, రజినీ పాల్గొన్నారు.

కాణిపాకంలో పూర్తికావస్తున్న బ్రహ్మోత్సవ ఏర్పాట్లు

కాణిపాకం, ఆగస్టు 24 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో ఈనెల 27 నుండి జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల గడువు దగ్గర పడుతుండడంతో ఏర్పాట్లు శరవేగంగా సాగుతూ తుదిమెరుగులు దిద్దుకుంటున్నాయి. దేవస్థానంలో ఈనెల 27 నుండి స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రతిఏటా 21 రోజులు పాటు జరిగే ఈఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈమేరకు బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి దేవస్థానం గత నెల రోజుల నుండే ఏర్పాట్లు చేపట్టింది. బ్రహ్మోత్సవాల ప్రారంభానికి కేవలం రెండు రోజుల వ్యవధి మాత్రమే వుండడంతో ఈఏర్పాట్లను శరవేగంగా నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ప్రధాన ఆలయంతో పాటు పరివార ఆలయాలకు రంగులు వేయడం, ప్రధాన ఆలయంలో రంగవల్లులు తీర్చిదిద్దడం, విద్యుత్ దీపాలంకరణ, తాత్కాలిక షెడ్లు, గణేషదీక్ష మండపం ఏర్పాటు, రథం మరమ్మత్తులు వంటి పనులు పూర్తి కావస్తుండంతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు దాదాపు పూర్తవుతోంది. మిగిలిన చిన్న చిన్న ఏర్పాట్లును రెండు రోజుల్లోగా పూర్తి చేయడానికి ఆలయ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. అలాగే ఆలయ పరిసరాలు, ఇతర ప్రాంతాల్లో విద్యుద్దీపాల కటౌట్‌లు, ఆర్చిల ఏర్పాటుకు రాత్రంబవళ్ళు కార్మికులు శ్రమిస్తున్నారు.అలాగే ఇప్పటికే పూర్తయిన ఏర్పాట్లుకు తుదిమెరుగులు దిద్దుతున్నారు.

తమ్ముళ్ళ నోట పలుకే బంగారమాయే!?

-అధికారంలో ఉన్నా వైసిపి ఆరోపణలపై స్పందించలేరే??

ప్రభాతవార్త-తిరుపతి:

"ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికి ఎరిగినట్లు"అనే చందాన తిరుపతిలో తెలుగుతమ్ముళ్ళ, సీనియర్ నాయకుల తీరు మారింది. అధికారంలో ఉన్నా,ప్రతిపక్షంలో ఉన్నా వైసిపి నేతలు విసురుతున్న ఆరోపణలు, విమర్శలపై తిరుపతిలో టిడిపి నేతలు నోరుమెదపలేకపోవడం వెనుక ఆంతర్యమేమిటనేది తిరుపతిప్రజలనేగాక ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసుల్లో ఒకింత అనుమానపు చర్చ మొదలైంది. ఏదో తూతూమంత్రంగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గోనడం, అధిష్టానం ఆదేశాలు, పిలుపుతో ఫోటోలకు ఫోజులతో టిడిపి నేతలు సరిపెటుకుంటున్నారనే ఆరోపణలు ప్రజల్లో బలంగా వ్యక్తమవుతున్నాయి. పదవులు కట్టబెట్టలేదనే అక్రోశంతో ఉన్న తెలుగుతమ్ముళ్ళు ప్రభుత్వంపై వైసిపి నేతలు ఆరోపణలు, విమర్శలతో విరుచుకుపడుతున్నా కనీసం మాటవరుసకైనా ప్రతివిమర్శలు చేయకపోవడం మాత్రం టిడిపి తీరుపై మరోలా చర్చకు తావిస్తోంది. గత ఐదేళ్ళలో తిరుపతిలో టిడిపి నేతలు కొందరు వైసిపితో అంటకాగారనే బలమైన ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు అలాంటి వారి పరిస్థితి ఇలాగే ఉందనేది జనంలో గుసగుసలు.కూటమిప్రభుత్వం ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల అమలు, టిటిడిపై విమర్శలు, టిక్కెట్ల గోల, గోవుల మరణాలు, చివరకు సిఎం చంద్రబాబునాయుడుపై, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌పై విమర్శనాస్త్రాలు ఎక్కుపెడుతున్నా ధీటుగా జవాబిచ్చే టిడిపి నేతలు లేకపోవడం విచారకరమని కార్యకర్తలు బాహాటంగానే ఆవేదన వెల్లగక్కుతున్నారు. టిటిడి ఛైర్మన్‌పై ఇటీవల వైసిపి నేతలు అన్ని రకాలుగా ఆరోపణలు చేయడం మరీ ప్రధానంగా మారింది. అంతేగాక తాజాగా ఓ మంత్రి తిరుపతిలో చేసిన నిర్వాకంపై కూడా వైసిపి ఆరోపణల పర్వం మొదలుపెట్టింది. అయినా ఒక్కరంటే ఒక్కరు కూడా తిరుపతిలో నోరుమెదపలేదంటే అతిశయోక్తిలేదు. పైగా తామంతా పార్టీలో ఉన్నామంటే ఉన్నామనే ఉనికి చాటుకోంటున్నారు తప్ప బలమైన నాయకులమనే సత్తా చాటలేకపోతున్నారు. టిటిడి ధార్మికసంస్థపై వైసిపి మాటల యుద్ధం మొదలైనా స్ట్రాంగ్ కౌంటర్‌ఇచ్చే నాయకులు టిడిపిలో కరువయ్యారు. తిరుపతిలోనేగాక చిత్తూరు, పలమనేరు, పూతలపట్టు, శ్రీకాళహస్తి, నగరి నియోజకవర్గాల్లో అధికార పార్టీ ఎమ్మెల్యేలే కొనసాగుతున్నారు. ఎక్కడా కూడా వీరెవరూ నోరుతెరుస్తున్న దాఖలాలు లేవు. తిరుమల పుణ్యక్షేత్రంలో "గోవింద" నామం తప్ప మరేపదం వినిపించడానికి వీలులేని విధంగా పవిత్రతను కాపాడటంలో సిఎం చంద్రబాబు కఠినంగా ఆదేశాలిచ్చారు. గత ఏడాదిలో కొండపై రాజకీయ వ్యాఖ్యలు చేసిన ప్రజాప్రతినిధులుగానీ, రాజకీయ నాయకులు గానీ లేరు. మొన్నటికిమొన్న కడపజిల్లా వైసిపి అధ్యక్షుడు, మాజీ సిఎం వైఎస్ జగన్ మేనమామ రవీంద్రనాథరెడ్డి రాజకీయ వ్యాఖ్యలపై టిడిపినేతలు కౌంటర్ ఇవ్వలేకపోయారు. తిరుమలపవిత్రతను కాపాడటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనేది దేశవ్యాప్తంగా భక్తుల అభిమతం. మరీ అధికారంలో ఉన్న తిరుపతిలోని టిడిపి నేతలు మౌనముద్ర దేనికిసంకేతమనేది ఆపార్టీ అధిష్టానం తేల్చాల్సిందే.

వినాయకుని మనసారా పూజిద్దాం

-కేంద్రమంత్రి భూపతిరాజుశ్రీనివాసవర్మ

తిరుపతికార్పొరేషన్,
ఆగస్టు 24ప్రభాతవార్త:

హిందువుల అత్యంత ముఖ్యమైన పండుగ వినాయకచవితి అని, అందరూ కలసి సమిష్టిగా ప్రశాంతంగా ఈ పండుగను జరుపుకోవాలని కేంద్రమంత్రి భూపతిరాజుశ్రీనివాసవర్మ కోరారు. హిందువులు తమతమ ఇళ్ళలో ఉన్నంతలో జరుపుకునే వినాయకచవితి పండుగకు తిరుపతిలో వరసిద్ధివినాయక మహోత్సవ కమిటీ నాయకులు ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు. వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్ ఆహ్వానం మేరకు ఆదివారం ఉదయం కమిటీ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, సభ్యులు గుండాల గోపీనాథరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి,వరప్రసాద్ ,ఊకావిజయకుమార్,సదాశివం, అనూషరామకృష్ణ, డిపి ఆనంద్, మల్లారపు వాసు, గోపీప్రసాద్, గంటసాల కృష్ణ, డాక్టర్ నరేశ్,బాలాజీ, మల్లకుప్పం శేఖర్, కొండే చెంగారెడ్డి పాల్గొన్నారు.

గ్లోబల్ హెల్త్‌కేర్ క్యాపిటల్‌గా భారత్

– అపోలో హాస్పిటల్స్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి

చిత్తూరు రూరల్, ఆగస్టు 24 ప్రభాతవార్త:

భారతదేశం భవిష్యత్తులో ప్రపంచ హెల్త్‌కేర్ క్యాపిటల్‌గా అవతరిస్తుందని దీనికోసం అపోలో యూనివర్సిటీ గొప్ప విజన్‌తో ముందడుగు వేస్తోందని అపోలో హాస్పిటల్స్ వ్యవస్థాపక చైర్మన్, అపోలో యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి అన్నారు. చిత్తూరు అపోలో నాలెడ్జ్ సిటీలో ఆదివారం అధ్యాపకులు, విద్యార్థులతో జరిగిన ముఖాముఖి కార్యక్రమానికి డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా భారత వైద్యుల ఆధిపత్యంను గుర్తు చేస్తూ అమెరికాలో దాదాపు 10 శాతం, ఇంగ్లండ్‌లో 25-30 శాతం వరకు హెల్త్‌కేర్ రంగంలో భారత వైద్యులే కీలక స్థానాలు దక్కించుకున్నారన్నారు. ఇది భారత వైద్యుల ప్రతిభ, నిబద్ధతకు నిదర్శనమన్నారు. మనదేశంలో అపారమైన మానవ వనరులు, ప్రతిభావంతులైన యువత ఉన్నారని, వారికి తగిన శిక్షణ, మార్గదర్శకత ఇస్తే భారత్‌ను ప్రపంచ హెల్త్‌కేర్ క్యాపిటల్‌గా నిలబెట్టగలమనే ధృడ విశ్వాసం తనకు వుందన్నారు. మన యువతే దేశ భవిష్యత్తు వారిని సరిగా తీర్చిదిద్దితే వైద్యరంగంలో భారత్ అగ్రగామి అవ్వడం ఖాయమన్నారు. హెల్త్‌కేర్ అంటే కేవలం మందులు మాత్రమే కాదని, టెక్నాలజీ, ప్రివెంటివ్ కేర్, ఎమర్జెన్సీ సేవలు కూడా సమానంగా అవసరం అన్నారు. అపోలో యూనివర్సిటీలో ఇంజనీరింగ్ విద్యను సైతం అత్యున్నత ప్రమాణాలతో అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్.వినోద్‌భట్, రిజిస్ట్రార్ డాక్టర్ పోతురాజు, ఎఐఎంఎస్ఆర్ డీన్ డాక్టర్ అల్ఫ్రెడ్ జె.అగస్టీన్, ట్రస్ట్ సభ్యులు సత్యనారాయణరెడ్డి, అపోలో యూనివర్సిటీ, ఏఐఎంఎస్ఆర్ డీన్లు, అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో చవితి ఉత్సవాలు

గుడిపాల, ఆగస్టు 24 ప్రభాతవార్త:

ప్రశాంత వాతావరణంలో ప్రజలు వినాయకచవితి ఉత్సవాలను నిర్వహించుకోవాలని గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ పేర్కొన్నారు. వినాయకచవితి ఉత్సవాలు పురస్కరించుకుని ఎస్ఐ రామ్మోహన్ మాట్లాడుతూ వినాయకచవితి ఉత్సవాల నిర్వహణకు పోలీసుల అనుమతి తప్పనిసరి అన్నారు. వినాయక మండపాల ఏర్పాటు కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా సింగిల్‌విండో క్లియరెన్స్ విభాగం తీసుకువచ్చిందని, ఈ విధానం ద్వారా ఉచితంగా అనుమతి పొందవచ్చునన్నారు. అనుమతి కోసం దరఖాస్తు చేసుకునే వినాయక మండపాల కమిటీ సభ్యులు ప్రభుత్వం ఇచ్చిన పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే మండపాల వద్ద డిజె సౌండ్లు నిషేధమని, వేడుకల సందర్భంగా ఎలాంటి శాంతిభద్రతలు, మతపరమైన ఘర్షణలకు చోటు ఇవ్వకుండా ప్రశాంత వాతావరణంలో చవితి వేడుకలను నిర్వహించుకోవాలని ఆయన కోరారు.

వ్యాయామం ప్రతిరోజు చేస్తే మందులు దూరం

– సన్‌డే ఆన్ సైకిల్ కార్యక్రమ ప్రారంభంలో ఎస్పీ మణికంఠ చందోలు

చిత్తూరు, ఆగస్టు 24 ప్రభాతవార్త:

వ్యాయామం అనేది మందు కాదని, అయితే వ్యాయాయంను ప్రతి రోజు చేస్తే ఎలాంటి మందులు అవసరం వుండదని ఎస్పీ మణికంఠ చందోలు పేర్కొన్నారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వుల మేరకు ఆదివారం చిత్తూరు గాంధీ విగ్రహ కూడలిలో సన్‌డే ఆన్ సైకిల్ కార్యక్రమంను ఎస్పీ మణిచంద చందోలు ప్రారంభించి సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేటి వేగవంతమైన జీవనశైలిలో ప్రతిరోజు మనం ఎక్కువగా ద్విచక్రవాహనాలు, కార్లలో ప్రయాణించడం అలవాటుగా మారిందన్నారు. ఆధునిక సౌకర్యాలతో జీవనం సాగిస్తున్నప్పటికీ శారీరక చురుకుదనం లేకపోవడంతో ఆరోగ్య సమస్యలు రోజు రోజుకు పెరుగుతున్నాయన్నారు. ప్రతిరోజు కనీసం 30 నిముషాలు సైకిల్ తొక్కడం ద్వారా శరీరానికి అవసరమైన వ్యాయామం లభిస్తుందన్నారు. జిమ్‌కు వెళ్ళడం కంటే సైక్లింగ్ మరింత సహజసిద్ధమైన వ్యాయామం అన్నారు. సైక్లింగ్ ద్వారా పర్యావరణంకు హాని కలుగదని, శరీరం చురుకుగా మారి మనసు సైతం ప్రశాంతంగా వుంటుందన్నారు. అనంతరం ఏఆర్ ఎఎస్పీ శివానంద కిషోర్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించగా ఈ ర్యాలీలో ఎస్పీ మణికంఠ చందోలుతో పాటు నగర యువతీ యువకులు, ప్రజలు ఉత్సాహంగా సైక్లింగ్‌లో పాల్గొన్నారు. ఈ ర్యాలీ గాంధీ కూడలి వద్ద ప్రారంభమై ఎంఎస్ఆర్ సర్కిల్, చౌడేశ్వరమ్మగుడి కూడలి, దర్గా కూడలి మీదుగా ఎంఎస్ఆర్ సర్కిల్ నుండి గాంధీ సర్కిల్ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో చిత్తూరు డిఎస్పీ సాయినాథ్, ఏఆర్ డిఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్‌భాషాలు, వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్, టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్ఐలు సుధాకర్, చంద్రశేఖర్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఉదయ్‌కుమార్, సిబ్బంది, పెద్దఎత్తున యువతీ, యువకులు పాల్గొన్నారు.

రవీంద్రభారతిలో లతాశ్రీ మంచుపూలు ఆవిష్కరణ

పుంగనూరు, ఆగస్టు 24, ప్రభాతవార్త

పు.ర.సం సభ్యురాలు, ఉపాధ్యాయిని హేమలత (లతా శ్రీ) ప్రాసిన గజల్ సమ్మోహనాస్త్రం మంచి పూలు గజల్ సంకల్నాన్ని శనివారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో ప్రముఖులు ఆవిష్కరించారు. రాష్ట్ర గజల్ చరిత్రలో ఒకేరోజు ఒకే వేదిక పైన ఆరు గజల్ సంకలనాలను విడుదల చేసిన రికార్డులో పుంగనూరు రచయిత చోటు సంపాదించడం అభినందనీయమని పు.ర.సం అధ్యక్షుడు నాగరాజు హర్షం వ్యక్తం చేశారు. పట్టణానికి చెందిన ఉపాధ్యాయిని హేమలత దశాబ్ద కాలముగా రచనలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆమె గజల్ సాహిత్యం పట్ల ఆకర్షితులయ్యారు. ప్రముఖ గజల్ సాహితీవేత్త, గజల్ శిరోమణి గజల్ శ్రీనివాస్ వద్ద వర్చువల్ సమూహ సమావేశాల ద్వారా శిక్షణ పొందారు. లతా శ్రీ రాస్తున్న గజల్స్ వైవిధ్యాన్ని గుర్తించిన గజల్ శ్రీనివాస్ ఆమెను గజల్స్ సంకలనానికి శ్రీకారం చుట్టాలని సూచించారు. దీంతో ఆమె సమాజంలోని వివిధ కోణాలను మానవతను ఆత్మీయతను బంధాలను అనురాగాలను దేవుడు మీద భక్తిని ఆధ్యాత్మికతను గురువుల మీద శ్రద్ధ కోరుకుంటూ అనేకమైన గజల్స్ రాసి మంచి పూలు పేరిట విడుదల చేశారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో అక్కడ సాహితీ పెద్దలు హైదరాబాద్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ట్రాఫిక్ నాగభూషణం, ప్రముఖ గజల్ కవి పరిశోధకులు డాక్టర్ పోతగాని సత్యనారాయణ, ప్రముఖ గజల్ కవయిత్రి రిటైర్డ్ తెలుగు రీడర్ డాక్టర్ ఉమాదేవి జంధ్యాల వంటి ప్రముఖుల సారథ్యంలో పుస్తకావిష్కరణ జరిగింది. గజల్ సాహిత్య చరిత్రలో తొలిసారిగా రాష్ట్రస్థాయిలో ఆరు గజల్ సంకలనాలు రవీంద్ర భారతిలో విడుదల కాగా అందులో పుంగనూరు నుంచి లతాశ్రీ మంచుపూలు పుస్తకం వై విద్య భరితంగా నిలిచింది. లతా శ్రీను పుంగనూరు రచయితల సంఘం సభ్యులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయిని సరస్వతి, తెలుగుదేశం పార్టీ నాయకుడు విశ్రాంతి డిఎస్పి సుకుమార్ బాబు తదితరులు అభినందించారు.

పార్టీ బలోపేతానికి శయశక్తులా కృషిచేస్తాం

పాలసముద్రం, ఆగస్టు 24, ప్రభాతవార్త



పాలసముద్రం మండలంలో వైయస్సార్ పార్టీ మండల స్థాయి, గ్రామస్థాయి వివిధ విభాగాల కమిటీలలో పదవులు పొందిన వైఎస్ఆర్ పార్టీ నాయకులు ఆదివారం వైయస్సార్ పార్టీ గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఇన్చార్జి కృపా లక్షి మ్మని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞ తలు తెలిపారు. ఈ సందర్భంగా పదవు లు పొందిన వారు మాట్లాడుతూ వైయ స్సార్ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి మాపై ఎంతో నమ్మకంతో ఈ పదవులను మాకు అప్పు చెప్పారు వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీకి అహర్నిశలు కృషిచేసి మండలంలో పార్టీ బలోపేతానికి మా వంతుగా మేము శయ శక్తుల కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ పార్టీ మండల అధ్యక్షులు తులసిరామ్ యాదవ్, జెడ్పిటిసి అన్బు అలగన్, వైయస్సార్ పార్టీ మండల సీనియర్ నాయకులు సుందరాజు, మండల మహిళా అధ్యక్షురాలు రమా, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు అయ్యప్పన్ , మండల యూత్ అధ్యక్షులు ఆనంద్ మరియు మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

తిరుపతిలో 99 స్టోర్‌పై స్విగ్గీ భారీ పెటుబడి..

తిరుపతి విద్య ఆగస్టు 24 ప్రభాత వార్త:

ప్రముఖ ఆన్‌డిమాండ్ సౌకర్యవ వ్యవస్థ స్విగ్గీ లిమిటెడ్ తిరుపతిలో 99 స్టోర్ ఆఫర్ పై భారీ పెట్టుబడి పెడుతున్నట్లు సమస్త బిజినెస్ చీఫ్ ఆఫీసర్ సిద్ధార్థ భకు తెలిపారు.తిరుపతిలోని విలేకరులతో మాట్లాడుతూ జులైలో ప్రారంభించిన ఫ్లాట్ రూ. 99కి విస్తృత శ్రేణి వంటకాలను ఇకో సేవర్ విధానం ద్వారా ఉచితంగా డెలివరీ చేసే ఈ కొత్త ఆఫరింగ్ కోసం కస్టమర్ల నుండి అనూహ్యమైన ప్రతిస్పందన లభించిందని అన్నారు. తిరుపతి 99 స్టోర్ స్విగ్గీ సరసమైన ధర, ప్రామాణికతలను సమతుల్యం చేసే మెనూను రూపొందించడానికి స్థానిక రెస్టారెంట్ భాగస్వాములతో కలిసి పని చేస్తోందన్నారు.ఇది ప్రారంభమైన నాటి నుండి,తిరుపతిలో 99 స్టోర్ కి జనాల తాకిడి ఎక్కువైంది. బిర్యానీ స్థానికంగా అభిమానించే వంటకంగా మారింది. ఈ వంటకాలు నగర ప్రజల శీఘ్రమైన, రుచి నిండిన, సరసమైన ధరలతో పాటు కడుపు నింపే భోజనాల పట్ల ప్రాధాన్యతను తెలియచేస్తాయి అని పేర్కొన్నారు.ప్రియమైన నగర రుచులను రూ. 99 స్టోర్ కు తీసుకురావడానికి ద పారడైజ్, హాట్ స్పాట్, క్వాలిటీ స్పైసీ ఫ్యామిలీ రెస్టారెంట్ వంటి ప్రముఖ స్థానిక రెస్టారెంట్లు స్విగ్గీతో భాగస్వామం చేసామన్నారు. వినియోగదారుల అవకాశాల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ది పారడైజ్ యజమాని జయశంకర్, క్వాలిటీ స్పైసి ఫ్యామిలీ రెస్టారెంట్ యజమాని సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పవిత్ర గంగాజలంతో వివేకానందసాగర్ శుద్ధి

చిత్తూరురూరల్, ఆగస్టు 24 ప్రభాతవార్త:

చిత్తూరుపట్టణం, కట్టమంచిలోని వివేకానంద సాగర్‌ను చిత్తూరు నగర గణేష్ ఉత్సవ సమితి సభ్యులు ఆది వారం పవిత్ర గంగాజలంతో శుద్ధిచేసారు. ముందుగా గంగాజలంకు వేదపండితులచే శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి గణపతి బప్పా మోరియా అంటూ చెరువును జలంతో శుద్ధిచేసారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ ఈనెల 27న నిర్వహించే వినాయకచవితిని ప్రతిఒక్కరు సంతోషంగా జరుపుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా నిమజ్జనంను కట్టమంచిలోని వివేకానంద సాగర్‌నందు మాత్రమే జరపాలనీ, దుర్గానగర్‌కాలనీ చెరువు, గిరింపేట గంగినేనిచెరువులలో నిమజ్జనం చేయడానికి ఎటువంటి అనుమతులు లేదన్నారు. అలాగే పెద్ద, అతిపెద్ద విగ్రహాలను నిమజ్జనం చేయడానికి సైతం అధికారుల సహకారంతో క్రేన్‌లు అందుబాటులో వుంచుతున్నామనీ వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టరు, ఆర్డీవో, చిత్తూరు శాసనసభ్యులు, పోలీసుఅధికారులు, నగర మేయర్ తదితరులు పూర్తి సహకారం అందిస్తు న్నారని, వారికి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామభద్ర, గోళ్లహ రిప్రసాద చౌదరి, షణ్ముగం, తోళపాళ్యంవెంకటేష్, జయచంద్ర, జ్యోతిబాబు తదితరులు పాల్గొన్నారు.

పోటీతత్వం, సృజనాత్మకపై శిక్షణా తరగతులు

చిత్తూరురూరల్, ఆగస్టు 24 ప్రభాతవార్త:

చిత్తూరుపట్టణం, విజయం సైన్స్ అండ్ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలలో గత 7 రోజులుగా ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ, నాంది ఫౌండేషన్ మహేంద్ర ఫ్రైడ్ క్లాస్ రూం సంయుక్తంగా నిర్వహించిన శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిసాయి. విద్యార్థినులు పోటీ ప్రపంచంలో విజయం సాధించడానికి కావలసిన మౌఖిక నైపుణ్యం, భావ వ్యక్తీకరణ, సాఫ్ట్ స్కిల్స్‌ప్రదర్శన నైపుణ్యం, ఉద్యోగ నిర్వహణ నైపుణ్యం తదితర అంశాలపై ప్రతిరోజు 6గంటల పాటు శరత్‌బాబు, మెహబూబ్‌సుహాని, తపస్వి, విజయ రాఘవ కృష్ణ, క్రిబాకరన్, ధనగ మరియప్పన్, శ్రీహర్షలు శిక్షణలను అందించారు. ఈ శిక్షణా విధానాలు విద్యార్థులకు కావలసిన నైపుణ్యం, ఉద్యోగ ఎంపిక ప్రక్రియలో దోహదపడతాయనీ, ఈ తరగతులను తరచుగా తమ పిల్లలకు అందిస్తున్నట్లు విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి తెలిపారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

– కడ పి.డి. వికాస్ మర్మత్

కుప్పం, ఆగస్టు 24 ప్రభాతవార్త

నియోజకవర్గస్థాయిలో ప్రతి సోమవారం కుప్పంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంను నేడు సోమవారం అనివార్య కారణాలతో రద్దు చేసినట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. ప్రజలు గమనించాలని కోరారు.

రామకుప్పంలో జలహారతి కార్యక్రమం

రామకుప్పం, ఆగస్టు 24 ప్రభాతవార్త

మండలంలోకి ప్రవేశించిన హంద్రీ-నీవా జలాలకు కూటమి నేతలు జలహారతి కార్యక్రమం చేపట్టారు. రాజుపేట వద్దకు నీరు చేరడంతో పెద్ద ఎత్తున నేతలు అక్కడకు చేరుకుని విశేష పూజలు చేసి చల్లటి పానీయాలు పంచారు. ఈసందర్భంగా నేతలు మాట్లాడు తూ గత వైకాపా ప్రభుత్వం పనులు పూర్తి చేయకనే ఎన్నికల సమయంలో సెట్టింగ్‌లు వేసి మోసగించిం దన్నారు. సిఎం చంద్రబాబునాయుడు మరలా హంద్రీ-నీవా పనులు పూర్తి చేయించి నీళ్లు రప్పించా రన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, కార్యదర్శి నరసింహులు, నేతలు ఆంజనేయరెడ్డి, సీతాపతి, రామకృష్ణప్ప, గ ంట్లరెడ్డి, రఫీ, రవిరెడ్డి, విశ్వనాథ్, వెంకటాచలం, వెంకటరమణ, టివి రవి, విజయ్‌రెడ్డి, రామలింగారెడ్డి, బాలరాజు, సుబ్రి, అవినాష్, మంజునాథ్, ఆదిల్, సురేష్, రాజసింహ, ఆనంద్ పాల్గొన్నారు.

తెదేపాను గుండెల్లో పెట్టుకుంటాం

కుప్పం, ఆగస్టు 24 ప్రభాతవార్త

నలభై ఏళ్లలో ఎన్నడూలేని విధంగా మాదిగ కులాన్ని గుర్తించి రెస్కో డైరెక్టర్‌గా సతీష్ మాదిగను నియమించంతో తెలుగుదేశం పార్టీని గుండెల్లో పెట్టుకుంటామని దళిత ఉద్యమ నేత దేవరాజు మాదిగ పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారన్నారు. దీంతో ఆదివారం ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబును కలసి మాదిగ కులస్తులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే శాంతిపురం, కుప్పం మండలాల్లో సైతం మాదిగలకు నామినేటెడ్ పదవులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ ఇన్‌చార్జ్ రాజ్‌కుమార్, రాజేష్, వేణు, రామచంద్ర, రమేష్, సుబ్రమణ్యం, నరసింహులు, బాలు, కదిరప్ప, నాగరాజు, జయరాం, నారాయణస్వామి, మునిరాజెఉ, సతీష్, చంద్రశేఖర్, వెంకటేష్, శ్రీకా ంత్, భాస్కర్, ఆనంద్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి

వి.కోట, ఆగస్టు 24 ప్రభాతవార్త

పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామయ్య, సిఐటియు నేతలు వాడ గంగరాజు, గిరిధర్ డిమాండ్ చేశారు. ఆదివారం వి.కోటలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తెస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాల ను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. సుప్రీ ంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు నాగభూషణం, రాము, నేతలుమల్లయ్య, వెంకటముని, కారి ్మకులు పాల్గొ న్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

చిత్తూరుహెల్త్, ఆగస్టు 24 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిశీలించి పరిష్కరించడానికి కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుండి సమస్యలపై వచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి సంబంధిత అధికారులు హాజరై అర్జీలను పరిశీలించి సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మూల్యాంకనం సరళీకృతం చేయాలి

– రాష్ట్ర వైఎస్ఆర్‌టిఎ కోశాధికారి వి.రెడ్డిశేఖర్‌రెడ్డి డిమాండ్

చిత్తూరు, ఆగస్టు 24 ప్రభాతవార్త:

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించే మూల్యాంక విధానంను సరళీకృతం చేయాలని వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.రెడ్డిశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇప్పటికే విద్యాశాఖ అమలుపరుస్తున్న బోధనేతర పనులతో ఒత్తిడికి గురవుతున్న ఉపాధ్యాయులపై కూటమి ప్రభుత్వం అసెస్మెంట్ పుస్తకాలను అప్పజెప్పి మూల్యాంకనంపై పనిభారం పెంచడంతో ఆగ్రహంతో రగలిపోతున్నారన్నారు. ఈ పుస్తకాల వలన ప్రజాధనం దుర్వినియోగం తప్పా విద్యార్థులకు ఒరిగేది ఏమి లేదన్నారు. కూటమి ప్రభుత్వానికి ధైర్యం వుంటే ఈ విధానంను ప్రైవేటు పాఠశాలల్లో అమలు చేయాలని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ విధానంతో విద్యార్థులను ఆగస్టు నెలలో బోధనకు పూర్తిగా దూరం చేయడంలో కూటమి ప్రభుత్వం ప్రపంచ రికార్డు సాధించిందని ఎద్దేవా చేశారు. ఈ పరీక్షలు విద్యార్థుల కోసమా! ఉపాధ్యాయుల కోసమా! అనే సందిగ్ధత నెలకొందన్నారు. ఉన్నత పాఠశాలలో ఒక టీచరు కనీసం 600 పుస్తకాలను మూల్యాంకనం చేయాల్సి వస్తోందని, దీంతో ఉపాధ్యాయులందరు దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. ఈ విధానంను సులభతరం చేయకుంటే రాబోయే ఫార్మటివ్, సమ్మేటివ్ పరీక్షలను పూర్తిగా బహిష్కరిస్తామని ఆయన హెచ్చరించారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

మానవతావాది గువ్వల రామకృష్ణారెడ్డి

చౌడేపల్లి, ఆగస్టు 24 ప్రభాతవార్త

దివంగత గువ్వల రామకృష్ణారెడ్డి మానతావాదని పలుపురు తేదేపా నాయకులు కొనియాడారు. మాజీ జడ్పీటీసీ, బోయకొండ మాజీ ఛైర్మన్ గువ్వల రామకృష్ణారెడ్డి 5వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన తనయుడు మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి) ఆధ్వర్యంలో తెల్లనీళ్ళపల్లి రామకృష్ణారెడ్డి ఘాట్ వద్ద ఘనంగా నివాళులర్పించారు. స్థానిక బస్టాండులో అనూష్‌రాయల్, అర్జున్‌రాయల్, మణిసింగ్‌లచే గువ్వల రామకృష్ణారెడ్డి చిత్ర పటానికి పూలమాలలేసి సేవలను గుర్తు చేసారు. అనంతరం అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు. గువ్వల రామకృష్ణారెడ్డి నిజాయితీ, నిబద్ధత, ముక్కుసూటితత్వం నేటి తరానికి ఆదర్శమన్నారు. తేదేపా ఆవిర్భావం నుంచి ఆయన తుదిశ్వాస వరకు పనిచేశారనీ, నమ్ముకున్న వారినీ, పార్టీ సిద్ధాంతాన్ని విడిచిపెట్టకుండా అజాత శత్రువుగా పేరుగడించారన్నారు. తేదేపా నాయకులు పూల చంద్రమౌళి, ఆవుల రామచంద్రయ్య, పంజానిపల్లి బాబు, విజయ్‌భాస్కర్‌రెడ్డి, బోయకొండ సుబ్బు, జంపాల శ్రీనివాసులు, పవన్‌కుమార్, కళ్యాణ్, మాజీ సర్పంచు వెంకట్రమణ, గనీ, కుమార్‌రెడ్డి, ప్రభాకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మునివెంకటప్ప సేవలు మరపురానివి : మాజీ ఎంపి రెడ్డెప్ప

లద్దిగం(చౌడేపల్లి), ఆగస్టు 24 ప్రభాతవార్త

మాజీ ఐఎఎస్ అధికారి, ప్రిన్సిపుల్ కార్యదర్శి మునివెంకటప్ప సేవలు మరపురానివని చిత్తూరు మాజీ ఎంపి ఎన్.రెడ్డెప్ప అన్నారు. మండలంలోని లద్దిగం చర్చినందు మునివెకటప్ప 11వ. వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. దివంగత మునివెంకటప్ప బి.ఆర్.అంబేద్కర్ సేవాస్ఫూర్తితో చేసిన సేవలు ప్రజలు నిత్యం స్మరిస్తూనే వున్నాంన్నారు. వ్యవసాయ కూలీ కుటుంబం నుంచి ప్రిన్సిపుల్ సెక్రటరీగా ఎదిగిన ఆయన దళితుల అభివృద్ధి కోసం అహర్నిశలూ శ్రమించారన్నారు. తెలంగాణా రాష్ట్ర ఫైనాన్స్ సెక్రటరీ హేమమునివెంకటప్ప, విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారిణి గౌతమి, బ్యాంకు రెడ్డెప్ప, సుమిత్రా రమణ, మునస్వామి, శ్రీరాములు, సుదర్శన్, స్థానికులు పాల్గొన్నారు.

పలమనేరు చేరుకున్న ధ్వజస్థంభం

భారీఎత్తున ఊరేగింపు

పలమనేరు టౌన్, ఆగస్టు 24, ప్రభాతవార్త:

పలమనేరు కాశీవిశ్వేశ్వరస్వామి గుడిలో జరుగుతున్న ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా భాగంగా కొత్తగా గాలిగోపురం, ధ్వజస్థంభం ఏర్పాటు చేస్తున్నారు. కొత్తగా కేరళ నుండి వస్తున్న ధ్వజస్థంభం ఆదివారం ఉదయం పలమనేరు చేరింది. మేళతాళాలు బ్యాండు వాయిద్యాలతో పట్టణ ప్రజలు ఓం నమశివాయ అంటూ స్వాగతం పలికారు. మదనపల్లెరోడ్డు, బజారువీధి, రంగాపురం, ఎంబిటి రోడ్డు మీదుగా ధ్వజస్థంభం ఆలయం చేరుకుంది. దారిపొడవునా భక్తులు టెంకాయ కర్పూరాలతో హారతులిచ్చారు. మహిళలు గుమ్మడికాయలతో దిష్టితీశారు. ఆలయ ఆవరణలో అర్చకులు ధ్వజస్థంభానికి జలాభిషేకం, పాలబిషేకం పూజలు చేసి భద్రపరచారు. ఆలయ పునరుద్ధరణలో భాగంగా త్వరలో ఆవరణలో ధ్వజస్థంభం ప్రతిష్ట చేస్తారు.

పలమనేరులో మరో గ్రంథాలయ ఉద్యమం

పుస్తక పఠనంతో నడక కార్యక్రమం

పలమనేరు, ఆగస్టు 24, ప్రభాతవార్త:

అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా పలమనేరులో మరోగ్రంథాలయ ఉద్యమం నిర్వహిస్తున్నట్లు పలమనేరు రచయితల సంఘం సంయుక్త కార్యదర్శి జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, జనవిజ్ఞానవేదిక నాయకులు మిఠాయి యుగంధర్‌బాబు, గ్రంథాలయ అధికారి హేమకుమార్, తెలుగు సాహిత్య సమితి అధ్యక్షుడు తులసినాథంనాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 7న అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా 8న ఉదయం 9:30 గంటలకు పుస్తకంతో నడక కార్యక్రమం ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యుడు డా.వీఆర్ రాసాని ముఖ్య తిథిగా పాల్గొంటారని ఆయన చేతుల మీదుగా పిల్లలకు తెలుగుబాషా సంస్కృతి, బాలసాహిత్యానికి సంబంధించిన పుస్తకాలు అందజేస్తామని వివరించారు. ప్రజలకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించడానికి పుస్తకాలు చేతబట్టి నడక కార్యక్రమం నిర్వహిస్తున్నామని పాఠక ప్రియులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సిద్ధమవుతున్న పార్థీవ గణపతులు

పుంగనూరు రూరల్, ఆగస్టు 24, ప్రభాతవార్త

పట్టణంలోని శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో కలియుగంలో శీఘ్రఫలధాయని పార్థివ గణపతి విగ్రహాలను భక్తులకు ఉచితంగా అందించేందుకు వినూత్న కార్యక్రమం చేపట్టారు

తిరుపతి డివిజన్

సెయింట్‌లూయిస్ ఆసుపత్రి సారధ్యంలో పోషకాహారం

శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 24 ప్రభాతవార్త

ఏర్పేడు మండలానికి సమీపంలో డేవిడ్ లూయిస్ రీస్ హాస్పిటల్ సారధ్యంలో ఆదివారం పోషకాహారాల అవసరం అయిన బాధితులకు అందించే కార్యక్రమా లను ఏర్పాటు చేసారు. లవ్ ఇన్ యాక్షన్ ట్రస్టు సారధ్యంలో సుమారు 20సంవత్సరాలుగా ఏర్పేడు పరిసరాల్లో ఉషారీస్, ఎం.రీస్ రీస్‌లు ప్రత్యేక పోషకాహారాలు అవసరమైన వారిని ఆదుకుంటున్నారు.ప్రతి రెండు నెలలకొకమారు వీరిని సమావేశ పరచి వీరి సంరక్షణకు సేవలందిస్తున్నారు. రెండు నెలల కొక మారు వీరికి మనసికోల్లాసం కల్గించే ఆటపాటలు, ఆరోగ్యం పట్ల అవగాహన, క్రమశిక్షణతో చదువుకోవటం క్రమం తప్పక మందులు వాడటం,మనోధైర్యం కల్గించి జీవితంపై ఆశ కల్గించుటకు ఆశాజనకమైన ముందు చూరుతో బ్రతికేటట్లు చేస్తూ నైతిక విలువలను పెంపొందించే కదలికలతో పాటు పోషకాహారాలను అందిస్తున్నారు.ఆదివారం కందిపప్పు,ఉద్దిపప్పు, శెనగపప్పు, చిక్కిలు, రవ్వ,చక్కెర, బెల్లం, వంటనూనె, గోధుమపిండి, పచ్చబఠాని, తెల్లగుగ్గిళ్ళు, ఎర్రగుగ్గిళ్ళు, పెసలపప్పు, ఒక్కొక్కకేజీ చొప్పునఅందించారు. ఈ సంస్థ ద్వారా 160 మ ందికి సహాయం అందించారు. ఆదివారం నాటి కార్యక్రమాలకు శ్రీకాళహస్తి రోటరీ క్లబ్ తరఫున పిల్లలకు సబ్బులు, మల్టీవిటమిన్స్,టవల్స్ అందించారు.

నేటి నుంచి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణి: ఆర్‌డిఓ

శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 24 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్‌లో సోమవారం నుంచి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణి చేయనున్నట్లు ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి ఆదివారం తెలిపారు.శ్రీకాళహస్తిలో సుమారు 11వేల రేషన్ స్మార్ట్ కార్డులను పంపిణికి సిద్దం చేసినట్లు వివరించారు. ఈ పంపిణి కార్యక్రమాలు ఐదు రోజులపాటు జరుగుతాయని ఆర్‌డిఓ వివరించారు. ప్రజలకు ఇంటి వద్దకే స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తామని ఆయన వివరించారు.స్మార్ట్ రేషన్ కార్డు దారుడు కేవైసి చేసి కార్డులను అందజేస్తామన్నారు.ఈ స్మార్ట్ రేషన్ కార్డులు సకాలంలో లబ్దిదారులకు చేరాలంటే కార్డుదారుడు ఇంటి వద్దనే ఉంటూ తమ సిబ్బంది వచ్చినపుడు సహాకరించాలని ఆర్‌డిఓ కోరారు.

వీధుల్లో వినాయక ప్రతిమ ప్రతిష్టకు అనుమతులు తప్పనిసరి

కేవీబీ పురం, ఆగస్టు 24 ప్రభాతవార్త:

మండపాల వద్ద డీజే మ్యూజిక్ ఏర్పాటు నిషేధం, అనుమతులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసువాలని, అనుమతులు లేకుంటే చర్యలు తప్పవని ఎస్ఐ నరేష్ హెచ్చరించారు. వినాయక చవితి పురస్కరించుకుని వీధుల్లో వినాయక ప్రతిమ ఏర్పాటుకు పోలీసు శాఖ నుంచి అనుమతులు తప్పనిసరి అని కేవీబీ పురం ఎస్ఐ తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వినాయక ప్రతిమ ఏర్పాటుకు నిర్వాహకులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే పోలీసు శాఖ పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తుందన్నారు.అలాగే వినాయక మడపాల వద్ద డీజే మ్యూజిక్ ఏర్పాటు రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిందని, ఎవరు డీజే మ్యూజిక్‌ను పెట్టేందుకు అనుమతి లేదని నిబంధనలను అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడుతుందని ఆయన హెచ్చరించారు. వినాయక ప్రతిమలు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పని సరిగా అనుమతులు పొంది పండుగను సంతోషంగా జరుపుకోవాలని, పోలీసు శాఖకు సహకరించాలని మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎస్ఐతో పాటు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పిల్లలకు మంచి భోజనం పెట్టాలి...

బొజ్జల బృందమ్మ

రేణిగుంట ఆగస్టు 24 ప్రభాతవార్త

దూర ప్రాంతాల నుంచి చదువుల కోసం తల్లితండ్రులను వదిలి వచ్చిన విద్యార్థులకు మంచి భోజనం పెట్టాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాతృమూర్తి బృందమ్మ కోరారు. రేణిగుంట బిసి హాస్టల్, విమానాశ్రయ సమీపంలోని గురుకుల గిరిజన సాంఘిక సంక్షేమ పాఠశాలలను ఎమ్మెల్యే మాతృమూర్తి బొజ్జల బృందమ్మ ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో చదువు, భోజన, వసతి సౌకర్యాలపై చర్చించారు. గురుకుల పాఠశాలలో విద్యార్థుల కోసం వండిన ఆహారాన్ని పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లలకు భోజనం విషయంలో వండామా వడ్డించామా అనే పోకడలో పోకుండా మంచి భోజనాన్ని పెట్టాలని కోరారు. త్వరలో హాస్టళ్లకు వచ్చి భోజన విధానాన్ని పరిశీలిస్తానని మార్పు రాకపోతే ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి ఫిర్యాదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్డీఏ ప్రభుత్వం పిల్లలకు మంచి పౌష్టికాలతో కూడిన భోజనం పెట్టాలని ఆదేశించిన విషయాన్ని ఈ సందర్భంగా వార్డన్లకు గుర్తు చేశారు. ఆమెతోపాటు రేణిగుంట పట్టణ టిడిపి అధ్యక్షుడు మహబూబ్‌బాషా, మోహన్, టిడిపి నేతలు బాబు, రవి, కన్నన్ రెడ్డి, దినేష్, మేరీ, జయ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌ని కలసిన రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యవర్గం

పుత్తూరు రూరల్, ఆగస్టు 24 ప్రభాతవార్త:

రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నుకోబడి నటువంటి బుజ్జి రామ్‌ప్రసాద్‌ని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యవర్గం రాష్ట్ర అధ్యక్షుడు ఇసుకపల్లికామేశ్వర ప్రసాద్, గౌరవాధ్యక్షులు బాల రామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో కలవడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేదం హరిప్రసాద్, రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షులు గాలి శ్రీనివాసరావు, రాష్ట్ర కోశాధికారి ఉమామహేశ్వరరావు, రాష్ట్ర న్యాయవిభాగ కన్వీనర్ నారాయణరావు, వినుకొండ బ్రాహ్మణ సంఘం తిరుపతి, కడప, నెల్లూరు, చిలకలూరుపేట, కృష్ణ జిల్లాలో బ్రాహ్మణ సంఘాలు రాష్ట్ర ప్రతినిధులు మాధవరావు, రఘు మాస్టర్, దేవులపల్లి, చంద్రశేఖర్, సాయిరాం, రాఘవేంద్రనూతనంగా ఎన్నుకోబడిన చైర్మన్ బుచ్చి రామ్‌ప్రసాద్‌కి అభినందనలు తెలియజేశారు.

రాజీవ్‌నగర్‌లో ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం

కొందరి ఆక్రనందనలు: శాపాలు

శ్రీకాళహస్తి,ఆగస్టు 24 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి రాజీవ్‌నగర్‌లో అక్రమ ఆక్రమణల తొలగింపుకు శ్రీకారం చుట్టారు.రెవెన్యూ, పోలీసుల, మున్సిపల్ అధికారులు ఆదివారం పొద్దు పొడవకముందే రాజీవ్‌నగర్‌లో దర్శనమిచ్చారు. రాజీవ్‌నగర్‌లో కొందరు అక్రమార్కులు తిష్టవేసి గత ప్రభుత్వంలో విచ్చల విడిగా నిరుపేదల ఇంటి స్థలాలను రెవెన్యూ అధికారుల సహాయ సహకారంతో ఆక్రమించుకొని విక్రయాలు జరిపినట్లు కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే వాటిని తొలగిస్తామని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ప్రకటించారు.దాంతో 15 నెలల్లో రెండు సార్లు సర్వేలు జరిపారు.అయితే ఏ కారణాల చేతనో తొలగింపుకు సాహసించలేదు. కానీ నిరుపేదలకు సంబంధించిన ఇంటి స్థలాలను ఆక్రమించుకొని విక్రయించుకున్న ఆక్రమార్కుల భరతం పట్టాలని ఎంఎల్‌ఏ పలుమార్లు అధికారులకు సూచించారు. ప్రస్తుతం కొత్తగా వచ్చిన రెవెన్యూ అధికారులు ఆక్రమ ఆక్రమణలను తొలగింపుకు చొరవ చూపారు. శ్రీకాళహస్తి ఆర్‌డిఓ ఆదేశాలతో తహశీల్దార్ జనార్థన్‌రాజు, మున్సిపల్ కమిషనర్ భవానిప్రసాద్, సిఐలు నాగార్జున్‌రెడ్డి, తిమ్మయ్య వారి సిబ్బంది వెంటరాగా సిబ్బందితో రాజీవ్‌నగర్ చేరుకున్నారు. పలుమార్లు సర్వేలు జరిపి పరిశీలనలు జరిపిన తరువాత సమగ్ర నివేదికలతో రాజీవ్‌నగర్ చేరుకొని అక్కడ ఆక్రమణలను తొలగింపుకు శ్రీకారం చుట్టారు. ఇక్కడ సుమారు 150కి పైగా ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించారు.వాటిని తొలగింపుకు జెసిబిలను అందించారు.

అర్థనాదాలు, శాపనార్థాలు: అక్రమార్కుల మాయమాటలు నమ్మి దళారుల ద్వారా లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన వారు. పలుకుబడితో గతంలో పని చేసిన రెవెన్యూ అధికారులచే అక్రమంగా పట్టాలు పొందిన వారిని గుర్తించి తొలగింపుకుశ్రీకారం చుట్టారు.దాంతో బాధితులు తమకు ముందుగా నోటీసులు జారి చేయకుండా ఎలా తొలగిస్తారంటూ అర్థనాదాలు చేయటం మొదలెట్టారు. కొందరు అయితే శాపనార్థలు పెట్టడం మొదలెట్టారు.ఇకనకడ హాజరైన అధికారులు మీకేదైనా బాధలుంటే ఆర్‌టిఓకు చెప్పుకోమని సూచించారు.అయితే సోమవారం కూడా ఆక్రమణలను తొలగింపు కార్యక్రమాలుంటాయని తెలిసింది. అయితే ఈ తొలగింపులకు సంబంధించి అధికారులు ఎవ్వరూ పెదవి విప్పటం లేదు.

ఆంగ్లభాష మెళకువలపై ఉపాధ్యాయులకు శిక్షణ

తిరుచానూరు, ఆగస్టు 24 ప్రభాతవార్త

తిరుచానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 100 మంది ఉపాధ్యా యులకు డైరెక్టర్ రామేశ్వర్ గౌడ్ ఒక రోజు ప్రత్యేక శిక్షణను ఇచ్చారు. ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమ రసి (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయుల ఆంగ్ల భాష నైపుణ్యాల పెంపు కోసం ప్రత్యేక శిక్షణ తరగతులు జరుగుతు న్నాయి. ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు విల్ టు కెన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్, హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఆన్లైన్ తరగతులు ఉచితంగా అందిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం కార్యక్రమానికి హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి కేవీఎన్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అన్ని తరగతులకూ ఇంగ్లీష్ మాధ్యమంలో బోధన జరుగుతుండటంతో ఉపాధ్యాయులకు ఇంగ్లీష్ పరిజ్ఞానం అత్యవసరం. ఈ శిక్షణతో ఉపాధ్యాయుల స్పీకింగ్ స్కిల్స్ పెరుగుతాయన్నారు.ఉపాధ్యాయులు ఇంగ్లీష్‌లో నైపుణ్యం పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థులు కూడా ఆత్మవిశ్వాసంగా మాట్లాడగలరని తెలిపారు.ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు కె.డి. సారథి, చంద్రశేఖర్ నాయుడు, ప్రధానోపాధ్యాయులు మురళి, సహోపాధ్యాయులు లీల ప్రతాప్ తదితరులు సహకరించారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

పాఠశాల అభివృద్ధి, నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధి

చంద్రగిరి, ఆగస్టు 24 ప్రభాతవార్త:

స్థానిక కొత్తపేటలోని సిద్ధార్థ ఇంగ్లీషు మీడియం స్కూల్లో ఆదివారం పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం జరిగింది. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1981-82 పదవ తరగతి బ్యాచ్ మొదటి సారి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్దులు నేర్పిన పాఠశాల అభివృద్ధితో పాటు నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తమవంతు కృషి చేయ సంకల్పించారు. ఆ మేరకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను జి.రామకృష్ణమూర్తి వివరించారు. మరోసారి పూర్తి స్థాయి బ్యాచ్ కలిసేందుకు ఎవరెవరు ఎక్కడెక్కడ వున్నారనే విషయంపై పరిశీలించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రవిచంద్ర, చంద్రశేఖర్, రామిరెడ్డి, రూప్‌కుమార్, శేఖర్, వెంకటేష్ రెడ్డి, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యం కోసం కృషి

వడమాలపేట, ఆగస్టు 24 ప్రభాతవార్త:

ప్రజల ఆరోగ్యం కోసం ఉషోదయ వాకర్స్ అసోసి యేషన్ కృషి చేస్తున్నదని వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేటి రవిరాజు పేర్కొన్నారు. వడమాలపేట మండలం సీతారామపురం గ్రామంలో ఉచిత మెగావైద్య శిబిరం జరిగింది. వాసన్ ఐ కేర్ ఆస్పత్రి, మాధురి రేమిడీ ఆస్పత్రి వైద్యులు గ్రామ ప్రజలకు రక్త పరీక్షలు, షుగర్ పరీక్షలు, ఈసీజీ, కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. సుమారు 50 వేల రూపాయలు విలువ గల మందులు ఉచితంగా అందజేశారు. 175 మందికి కంటి పరీక్షలు చేసి అందులో 37 మందికి సహాస్ర చికిత్సకు ఎంపిక చేశారు. ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడురవిరాజు, ప్రెసిడెంట్ బాబు, కార్యదర్శి రామ్మోహన్‌వర్మ, ఉపాధ్యక్షులు చంద్రబాబు, కోశాధికారి రమేష్‌రాజు, గ్రామ పెద్దలు గోపాల్‌నాయుడు, రంగయ్య నాయుడు, మురళీనాయుడు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. మాధురి రెమిడీ ఆస్పత్రి డాక్టర్స్ చైర్మన్ మాధూరి గాంధీ, మంజునాథ్, కుమార్, హరిదీప్, అంజి, తిరుపతి వాసన్ ఐ కేర్ ఆస్పత్రి డాక్టర్లు వెంకటేష్, బాలకృష్ణ టెక్నిషియన్స్ కీర్తి, అశ్విని, సుందర్ కుమార్‌రాజు, సుకుమార్ రాజు, అమరావతి, కళావతి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

స్కూలు అసిస్టెంట్ జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన అభ్యర్థి విజయ్

సత్యవేడు, ఆగస్టు 24 ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ మెరిట్ జాబితాలో తిరుపతి జిల్లా సత్యవేడు మండలంనీలి తొట్టి కండ్రిగ గ్రామానికి చెందిన అభ్యర్థి ఎస్.విజయ్ స్కూలు అసిస్టెంట్(తెలుగు)లో జిల్లాలోని మొదటి ర్యాంకు సాధించారు. 87.01907 మార్కులతో అభ్యర్థి విజయ్ మొదటి స్థానంలో నిలిచారు. నీలి తొట్టి కండ్రిగ గ్రామానికి చెందిన ఎస్.మునికృష్ణ, కుమారి దంపతుల కుమారుడు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ పరీక్షలు రాయడం జరిగింది. ఈ నేపథ్యంలో స్కూలు అసిస్టెంట్‌కు సంబంధించి జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించడంతో పాటు జీజీటీలోను జోనల్ స్థాయిలో 80.70 మార్కులతో నాలుగవ ర్యాంకు సాధించారు. ఈ క్రమంలో స్కూలు అసిస్టెంట్(తెలుగు)లో జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన విజయ్‌ను పలువురు బందువులు, శ్రేయోభిలాషులు అభినందించారు.

ఆనంద్ రాజ్ కుటుంబానికి టిడిపి అండగా ఉంటుంది....

డాలర్స్ దివాకర్ రెడ్డి..

రేణిగుంట ఆగస్టు 24 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బాబు ఆనం ద్ రాజ్ కుటుంబానికి టిడిపి అండగా ఉంటుందని తుడా చైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి, డాలర్స్ దివాకర్ రెడ్డి భరోసా ఇచ్చారు. రేణిగుంట జ్యోతి దగ్గర చెందిన టిడిపి సీనియర్ నాయకులు బాబు ఆనంద్ రాజ్ ఆదివారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన భౌతిక కాయాన్ని డాలర్స్ దివాకర్ రెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తూ ధైర్య వచనాలు చెప్పారు. నివాళులు అర్పించిన వారిలో జ్యోతి నగర్ టిడిపి నాయకులు బాబు, రేణిగుంట పట్టణ టిడిపి యువనేత ఎం.జి. రెడ్డి, బుల్లెట్ రాజా, సోము తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి 100వ జన్మదిన వేడుకలు

శ్రీకాళహస్తి,ఆగస్టు 24 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి ముత్యాలమ్మగుడివీధిలోని సత్యసాయి బాబా 100వ జన్మదిన వేడుకలు ఆదివారం అంగరం గవైభవంగా ప్రారంభించారు. త్వరలో బాబా 100వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించాలని భక్తులు నిర్ణయించారు.ఈ నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా ప్రశాంతి నిలయానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు ఏ విధమైన సేవలు అందించాలన్న విషయంపై తిరుపతి జిల్లా జిల్లాలోని సాయి సేవకులు,.జిల్లా ఎసేవాదళ్ శిక్షణా శిబిరాన్ని శ్రీకాళహస్తిలోని సాయి సేవా మందిరంలో నిర్వహించారు.ఈ సమావేశానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు చుండూరు సురేంద్ర, రాష్ట్ర సేవా కోఆర్డినేటర్ విశ్వనాథ్‌రెడ్డి,స్నేహలతలు హాజరయ్యారు.పుట్టపర్తిలో చేపట్టాల్సిన ఎసేవలను గురించి దిశా,నిర్దేశం చేసారు. అలాగేయువతకు సంబంధించిన కార్యక్రమాలను గురించి రాష్ట్ర యూత్ కోఆర్డినేటర్ గౌతమ్ తెలియజేసారు. శిక్షణా కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అమర్‌నాథ్,జిల్లా స్థాయి సంస్థ పదాధికారులు,సమితి కన్వీనర్లు పాల్గొన్నారు. శ్రీకాళహస్తి సమితి కన్వీనర్ పాండురంగయ్య వారి బృందం ఏర్పాట్లు పర్యవేక్షించారు.ఈసందర్భంగా వక్తలుస్వామి వారు చూపించినమార్గాన్ని ఆధ్యాత్మిక సేవకు సాధన గురించి అవగాహన కల్పించారు.

సేవా భావం దేవుడిచ్చిన వరం: ఆర్‌డిఓ

శ్రీకాళహస్తి,ఆగస్టు 24 ప్రభాతవార్త

మనిషికి సేవా భావం దాన గుణం దేవుడిచ్చిన వం మని శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం హెల్పింగ్‌హ్యాండ్ ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రతిభావంతులకు సహాయం చేసే కార్యక్రమాలకు ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజర య్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 165 నెలలుగా క్రమం తప్పక అమలు చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్ కార్యక్రమాలు అధ్భుతమైనదన్నారు.ఈ సందర్భంగా ఆయన హెల్పింగ్ హ్యాండ్స్ సేవా కార్యక్రమాలపై చిత్రీకరించిన పాటను ఆవిష్కరించారు. సేవా, దాన గుణం అందరికి అబ్బదన్నారు. ఏ కొందరో స ఆధిస్తారన్నారు.ఈ నేపథ్యంలో సంస్థ నిర్వాహకులు మునీర్‌బాషాకు దేవుడిచ్చిన వరం దానం అన్నారు. ఆయన తన మతానికి సంబంధించిన సూత్రాలను పాటిస్తూ తాను సంపాదించే కష్టార్జితంలో కొంత దివ్యాగుల సంక్షేమానికి వారి కుటుంబాలను ఆదుకొనుటకు వెచ్చించటం అభినందనీయం అన్నారు. గరికపాటి రమేష్‌బాబు, కోళ్ళూరు హరినాయుడు,న్యాయవాది రాజేశ్వరరావు పాల్గొన్నారు.

కోలా ఆనంద్‌ను సత్కరించిన కాపు సంఘ నాయకులు

శ్రీకాళహస్తి,ఆగస్టు 24 ప్రభాతవార్త

రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడుగా స్థానిక నాయకుడు కోలా ఆనంద్‌కుమార్‌ను నియమించటం అభినంద నీయం అని కాపు నాయకులు అభినందించారు. ఆదివారం పట్టణానికి చెందిన నాయకులు ఆనం ద్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ ఎవరికి ఏ ఆపద వచ్చినా నేనున్నానని ముందుకు వచ్చే యువ నాయకుడు కౌన్సిలర్‌గా, శ్రీకాళహస్తీశ్వరాలయ చైర్మన్‌గా సమర్థవంతంగా పని చేయటమే కాకుండా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో బిజెపి పార్టీని బలోపేతం చేయటానికి ఎంతో కృషి చేసారన్నారు. అంతేకాక సామాజిక పరంగా తమను బలోపేతం చేయటానికి ఆయన కృషి అభినందనీయం అన్నారు.ఈ కార్యక్రమాల్లో సిద్దులుగారి ప్రసాద్, ఉప్పు కృష్ణయ్య, పూల కృష్ణమూర్తి, గంగుల పూడి సుబ్బారావు, నరేంద్రబాబు,సూరాగారి రమేష్,పసులేటి గిరిధర్, బొక్కసం మునిసు బ్బయ్య, టౌన్‌బ్యాంకుకు చెందిన భాస్కర్, ఏఎస్ఐ ప్రసాద్, పురుషోత్తం, బాబు,కప్పాహరికృష్ణ మేస్త్రీ ఆనంద్,పసుపులేటినవీన్‌కుమార్, జాజాలముని,రమణగారిఅనిల్,సాగిసతీష్,శ్యాంతదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణుని పరిణయం

పుత్తూరు రూరల్, ఆగస్టు 24 ప్రభాతవార్త:

పుత్తూరు మున్సిపల్ పరిధిలోని ముద్దుకృష్ణా పురంగ్రామంలో వెలసిన శ్రీ భామ రుక్మిణీ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో కృష్ణాష్టమి ఉత్సవాలు సందర్భంలో భాగంగా ఆదివారం ఉదయం శ్రీకృష్ణ పరిణయం వైభవంగా భక్తిశ్రద్ధలతో చేశారు. ఆలయంలోని చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసి ప్రత్యేక హోమాలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం మండళ వాయిద్యాల నడుమ ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నాని ఇంటికి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి

తిరుపతిరూరల్,ఆగస్టు24 ప్రభాతవార్త:

చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఇంటికి ఆదివారం కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి విచ్చేసారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు సాదరంగా ఆహ్వానించి, శాలువాతో సన్మానించారు. కూటమిని ప్రభుత్వ సంక్షేమ పాలనపై ఇరు ఎమ్మెల్యే చర్చించుకున్నారు.

శ్రీశక్తి విజయోత్సవ సభను విజయవంతం చేయండి

తిరుపతిరూరల్,ఆగస్టు24 ప్రభాతవార్త:

ఈనెల 30న జరగబోయే శ్రీశక్తి విజయోత్స వ సభను విజయవంతను చేయాలని పులివర్తి సుధారెడ్డి కోరారు. ఆదివారం రఘునాథ్ రిసార్ట్స్‌లోని టిడిపి పార్టీ కార్యాలయంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు మెగా డియస్సీ, తల్లికి వందనం, దీపం పథకం, తల్లికి వందనం పథకం ద్వారా తల్లుల ఖాతాల్లోకి నగదు జమ చేయడం జరిగిందని తెలిపారు.

దివ్యాంగుల పెన్షన్ల కోసం పోరాటం

వారికి న్యాయంచేయాలని వినతి

తిరుపతి,ఆగస్టు24 ప్రభాతవార్త:

తిరుపతినగరంలో దివ్యాంగులు అర్హులైన వా ళ్ళు పెన్షన్లు అందుకోలేకపోతున్నారని, వారికి న్యాయం చేయాలని వైసిపి నాయకులు కోరారు. ఈ మేరకు11వవార్డు వైసిపి నాయకులు జిల్లాపార్టీ ప్రధాన కార్యదర్శి గోపాలరెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు ధనశేఖర్, మండల ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, నాయకులు వెంకటముని, దొడ్డారెడ్డి మునికృష్ణారెడ్డి, వేంపల్లి రఘురాం, రవి,శీను తదితరులు 11వ వార్డు సచివాలయం కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. దివ్యాంగులు న్యాయమైన పెన్షన్ కోసం ఎదురుచూస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే తొలగించిన వారికి పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

యూట్యూబ్‌తో స్క్రీన్‌అవార్డ్స్ మైలురాయి

తిరుపతి,ఆగస్టు 24ప్రభాతవార్త:

దేశంలోనే సినిమా,కథల యొక్క అత్యంత వేడుకల్లో స్క్రీన్‌అవార్డ్స్ 2025 పున:రూపకల్పనను యూట్యూబ్‌లో ఆవిష్కరించడానికి ఒక కీలకఘట్టం ఆరంభమైంది. సంపాదకీయ విశ్వసనీయత, సాంస్కృతిక వారసత్వం డిజిటల్ పరిధి శక్తివంతమైన సమ్మేళనం .కంటెంట్,ఫార్మాట్‌కు డిజిటల్ వస్త్ర విధానాన్ని తీసుకని స్క్రీన్ అవార్డులు యూట్యూబ్‌లో ప్రసారం చేయబడతాయి. అద్భుతమైన వినోదంతో అందించబడుతుందని ప్రసాద్‌గుప్త తెలిపారు.

స్త్రీల పట్ల వివక్ష వీడాలి

వేద విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి

– నవలలు పిల్లల్లో పఠనా శక్తిని, సమాజం పట్ల అవగాహన పెంచాలి.

వెదురుకుప్పం, ఆగస్టు 24 ప్రభాతవార్త :

సాంకేతికత, విజ్ఞానంతో ప్రజలలో మార్పురావాలని సమాజంలో స్త్రీల పట్ల వివక్ష వీడడటం ద్వారానే సమసమాజ నిర్మాణం సాధ్యమవుతుందని, నవలలు పిల్లల్లో పఠనా శక్తిని, సమాజం పట్ల అవగాహనను కలిగించేలా ఉండాలని శ్రీవెంకటేశ్వర వేద విశ్వవిద్యాలయ ఉపకులపతి పేర్కొన్నారు. తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జాను అనే నేను నా స్నేహితురాళ్ళు, మునికిస్టడి మాణిక్యం నవలల పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భ ంగా ఆయన మాట్లాడుతూ విజ్ఞానం పెరిగింది క్షణం తీరుబడిలేకుండా పరుగులు పెట్టుతున్న సమాజంలో మానవీయ విలువలు తగిపోతున్న తరుణంలో పుస్తకాలు, నవలలు చదవడం ద్వారా కొంతవరకైన మార్పువస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ కడుపున పుట్టిన పిల్లలను బేధభావంతో చూస్తున్నారని చెప్పారు. మగపిల్లవాడికి ఇచ్చినంత స్వేచ్ఛ ఆడపిల్లలకు ఇవ్వడంలేదని పల్లెల్లో ఈ భేదం అధ

ప్రజల్లో సైన్స్ పట్ల అవగాహన పెంచాలి

- విభవు బాలసుబ్రమణ్యం

గూడూరు, ఆగస్టు 24, ప్రభాతవార్త

గూడూరు విశ్రాంత ఉద్యోగుల భవనంలో జన విజ్ఞాన వేదిక జిల్లా మహాసభలు జరిగాయి. ఈ మహాసభలలో ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ విభవు బాలసుబ్రమణ్యం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. విటపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని తీసుకువెళ్లి సైన్స్ పట్ల అవగాహన కల్పించాలని మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పనిచేయాలని అదేవిధంగా పర్యావరణాన్ని కాపాడే బాధ్యత తీసుకోవాలని తీర్మానాలు చేయడం జరిగింది. ఈ జిల్లా మహాసభలలో బాలసుబ్రహ్మణ్యం జన విజ్ఞాన వేదిక సైన్స్ ప్రచార సంస్థగా ఉండాలని ప్రజల్లో ఉన్నటువంటి మతాలను గౌరవిస్తూ మూఢనమ్మకాలను పోగొట్టాలని మతాల పేరుతో రాజకీయాలు చేస్తే వాటిని అడ్డుకోవాలని అదేవిధంగా గ్రామాలలో అందరూ చదువుకునే విధంగా కృషి చేయాలని ఉక్రెయిన్, రష్యా మధ్య జరిగేటటువంటి యుద్ధంలో వేసుకునే అనుబాంబులు కూడా సైన్స్ కారణం అవటం కూడా బాధాకరమని సైన్స్‌ను ప్రజల కొరకు ఉపయోగించాలి కానీ యుద్ధాల కోసం కాదని చెప్పారు ముఖ్యంగా విద్యార్థులు చదువుకుంటేనే సామాజిక బాధ్యత కలిగి సమాజ శ్రేయస్సుకు పాటుపడతారని అందుకు జనవిజ్ఞాన వేదిక లాంటి సంస్థలు మీకు అండగా ఉంటాయని వారి ద్వారా మీరు ఒక మంచి సమాజం కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక సమాజ శ్రేయస్సు కై పాటుపడుతూ అందరి మన్ననలు పొందుతూ అనేక కార్యక్రమాలతో ముందుకు వెళుతుందని నేను కూడా జే.వి.వి కార్యక్రమాల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని వారు చేసే కార్యక్రమాలకి నా సహకారం ఎప్పుడూ ఉంటుందని జనవిజ్ఞాన వేదిక సభ్యులందరినీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని చెప్పారు. పట్టణ వీధుల్లో ప్లాస్టిక్ తయారు చేసే ఫ్యాక్టరీలను మూసివేయాలని, పర్యావరణాన్ని కాపాడాలని ప్రదర్శన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గూడూరు జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, చెంచు నారాయణ, రామ మోహన్, సుమన్ రెడ్డి, ఇబ్రహీం, శర్మ, అశోక్, తిరుపతి సూళ్లూరుపేట, నాయుడుపేట అధ్యక్ష, కార్యదర్శులు, విద్యార్థులు జేవివి సానుభూతిపరులు పాల్గొన్నారు.

గూడూరు డివిజన్

ఓబీసీలకు పొలిటికల్ రిజర్వేషన్లు కల్పించాలి

- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్

గూడూరు, ఆగస్టు 24, ప్రభాతవార్త

దేశ జనాభాలో 50 శాతం ఉన్న ఓబీసీలకు పొలిటికల్ రిజర్వేషన్లు ఇవ్వాలని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్ డిమాండ్ చేశారు. ఎస్సీ ఉద్యోగుల సంఘం, ఎస్సీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న రాజ్యాంగ పరిరక్షణ యాత్ర ఆదివారం ఉదయం గూడూరు పట్టణానికి చేరుకుంది. టవర్ క్లాక్ కూడలిలో ఎస్సీ నాయకులు ఈ యాత్రకు ఘన స్వాగతం పలికారు. అనంతరం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ముఖ్య అతిథిగా చింతామోహన్ పాల్గొని దళిత విభజన చాలా దురదృష్టకరమని పేర్కొన్నారు. దేశంలో ఎస్సీల్లో 800 కులాలు ఉన్నాయని, ఒక్క ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో 87 ఉప కులాలు ఉన్నాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయం దేశానికి మంచిది కాదన్నారు. భారత రాజ్యాంగం రాసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్ని కులాలను, అన్ని మతాలను, అన్ని భాషలను, ప్రాంతాలను కలిసి ఉండేటట్లుగా, ప్రపంచం దేశాల్లో ఎక్కడాలేని విధంగా, గొప్ప రాజ్యాంగం రచించారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చింది ఆర్డర్ కాదని, డైరెక్షన్ ఇచ్చిందని, దాన్ని అడ్డం వేసుకుని, దళితులను విభజించడం దుర్మార్గమని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. దళిత విభజన వల్ల దేశం తీవ్రంగా నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.దేశ జనాభాలో 50 శాతం ఉన్న ఓబీసీలకు పొలిటికల్ రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు అశోక్ బాబు, ఆర్.పి.ఐ రాష్ట్ర అధ్యక్షులు దాసరి చెన్నకేశవులు, ఎస్సీ సంఘాల నాయకులు శ్రీనివాసరావు, ప్రతాప్, చిట్టిబాబు, హరి, ప్రశాంత్, కోటేశ్వరరావు, వేణు, రమణయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సంస్కారంతో కూడిన పాఠాలు

కోట, ఆగస్టు 24 ప్రభాతవార్త

ఆధునిక సమాజంలో చరవాణి వినియోగం, సినిమాల ప్రభావం, తల్లిదండ్రుల పర్యవేక్షణ లేమితో విద్యార్థులు చాల మంది క్రమశిక్షణ తప్పుతున్నారు. ఈ పరిసితుల్లో భావి పౌరుల్లో మార్పు తీసుకొచ్చేందుకు ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు సూచనలతో పాఠశాలల్లో విలువులతో కూడిన విద్య అందిచేలా ప్రభుత్వం ఆలోచన చేసింది. అందులో భాగంగా విలువల విద్య పుస్తకాలను ముద్రించి విద్యార్థులకు పంపిణీ చేశారు. కోట మండలంలో ఏడు ఉన్నత పాఠశాలలకు ఈ పుస్తకాలను అందచేశారు.నైతిక విలువలు, సంస్కారం,వినమం, నిజాయతీ, కుటుంబ సంబందాలు పెంచేలా పాఠాలు రూపొందించారు.వివిధ అంశాలతో ఆరో తరగతి విద్యార్థులకు తోరణాలు, ఏడుకు మనో వికాసం, ఎనిమిదికి సూక్తి సుధ,వదో తరగతి విద్యార్థులు కోసం అమృత ధార పేరుతో పుస్తకాలు రూపొందించారు. ఆరో తరగతి పుస్తకంలో సాయం చేద్దాం, యోగ్యతకే అధికారం,సాటిలేని మేటి ,నడత, గుణం, తదితర అంశాలతో కథలు రూపొందించారు.ఏడు, ఎనిమిది తరగతల వారి కోసం నిషిద్ధం, దృష్టి కోణం,సుజనుడు, కుటుంబ విలువలు దివ్యాంగులకు చేయూత, దృఢచిత్తం, ఓరుతో విజయం, అందమైన అలవాటు,సాయానికి సిద్ధం, శిక్షణ,దుర్గుణాలు, గౌరవం, అశాలను పొందపర్చారని కోట ఎంఇఒ మస్తానయ్య తెలిపారు.

ఇస్రో క్రూ మోడ్యుల్ డ్రాప్ టెస్ట్ విజయవంతం

సూళ్ళూరుపేట ఆగస్టు 24 ప్రభాతవార _;

సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో ఆదివారం భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ ఇండియన్ ఏర్‌ఫోర్స్, ఇండియన్ కోస్టార్డ్,నేవిదళాలు సంయుక్తంగా గగన్ యాన్ మిషన్‌కు సంబంధించి ముఖ్యమైన పరీక్షను నిర్వహించారు.ఇందులో భాగంగా భవిషత్‌లో ప్రయోగించబోయే మానవ సహిత ప్రయోగాలకు ఉపయోగించే క్రూ మోడ్యూల్‌ను శ్రీహరికోట నుండి 35కిలోమీటర్ల దూరంలో భూమి ఉపరితలం 3కిలోమీటర్ల ఎత్తునుండి డ్రాప్ టెష్ట చేశారు.ప్రదానంగా ఈపరీక్షలో వివిద ఎలక్ట్రానిక్ పరికరాలు పేరాచూట్ సమర్థత పనితీరు వ్యోమగాములను సురక్షితంగా తీసుకురావడానికి కావల్సిన పరిస్థితులను పరీక్షించారు.అనంతరం సముద్రంలో పడిన క్రూ మోడ్యూల్‌ను నేవి దళాల వారు సేకరించి చెన్నై పోర్టుకు తరలించారు.

పేటలో బిజేపి బైక్ ర్యాలీ ...

నాయుడుపేట, ఆగస్టు 24 ప్రభాతవార్త ;

భారతీయ జనతాపార్టీ రాష్ట్రప్రధాన కార్యధర్శిగా రెండవసారి నియమితులైన సన్నారెడ్డి దయాకర్‌రెడ్డిని ఆపార్టీ నాయకులు,కార్యకర్తలు,అబిమానులు ఆదివారం పూలమాలలు,శాలువాలతో ఘనంగా సన్మానించారు.అనంతరం సన్నరెడ్డి దయాకర్‌రెడ్డి రెండవసారి బిజేపి రాష్ట్రప్రధాన కార్యదర్శిగా నియమించిన సందర్భంగా ఆయన అబిమానులు,నాయకులు,కార్యకర్తలు నాయుడుపేట పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈసందర్భంగా నాయుడుపేట పట్టణ బిజేపి అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి మాట్లడుతూ దయాకర్‌రెడ్డి రెండవసారి రాష్ట్రప్రదాన కార్యదర్శిగా నియమించడం సంతోషంగా ఉందన్నారు.ఆయన మరెన్నో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాక్షిస్తున్నామని తెలియజేశారు.ఈకార్యక్రమంలో బిజేపి నాయకులు,కార్యకర్తలు అబిమానులు,పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అగ్రిగోల్డ్ భూములలో అక్రమణదారుల సాగు

దొరవారి సత్రం, ఆగస్టు 24 ప్రభాతవార్త ;

దొరవారిసత్రం మండల పరిధిలోని అక్కరపాక గ్రామ సమీపంలో 111 ఎకరాల అగ్రిగోల్డ్ ఉన్న విషయం తెలిసిందే అయితే ప్రభుత్వం ఆధీనంలో ఉన్న అగ్రిగోల్డ్ భూములను గత వారం నుండి ట్రాక్టర్ ద్వారా సాగు చేస్తున్నారు అయితే అడ్డుకోవలసిన అధికారులే నిమ్మకు నీరుతున్నట్టు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రభుత్వ అగ్రిగోల్డ్ భూములను అక్రమ దారుల నుండి కాపాడాలని పలువురు కోరుకుంటున్నారు.

ప్రశాంత వాతావరణంలో చవితి వేడుకలు : సిఐ

వెంకటగిరి, ఆగస్టు 24, ప్రభాతవార్త

ఈనెల 27వ తేదీ జరగబోవు వినాయక చవితి పండుగను పురస్కరించుకొని గణేష్ విగ్రహాలను ప్రతిష్టించడం మండపాలు ఏర్పాటు చేయదలచిన వారు ముందుగా పోలీసు వారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సిఐ ఏవి రమణ తెలిపారు. వెంకటగిరిలోనే సిఐ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రజలు శాంతియుత వాతావరణంలో దైవ కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలని అదేవిధంగా కమిటీ సభ్యులు గణేష్ ఉత్సవాల సందర్భంగా అనుసరించవలసిన మార్గదర్శకాలు మరియు జాగ్రత్తలు తప్పకుండా పాటించాలని సూచించారు. కమిటీ అన్ని కార్యకలాపాలకు పూర్తి బాధ్యత విగ్రహాల ఏర్పాటు ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలిగించకూడదు లేదా ట్రాఫిక్‌ను అంతరాయం కలిగించరాదని తెలిపారు.

నేడు స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ

వాకాడు, ఆగస్టు 24, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పౌర సరఫరా శాఖ సివిల్ సప్లై కమిషనర్ కొత్త రేషన్ కార్డులను స్మార్ట్ కార్డుగా ఆధునీకరించి జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 25వ తేది సోమవారం పంపిణీ చేస్తున్నట్లు రెవెన్యూ ఇన్స్పెక్టర్ అఖిల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహశీల్దార్ కార్యాలయంకు 12259 కొత్త కార్డులను చేర్చారని తెలిపారు. ఈ కార్డులను సచివాలయ సిబ్బంది ద్వారా కార్డు దారులకు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

- గూడూరు రెండో పట్టణ సీఐ శ్రీనివాస్

గూడూరు, ఆగస్టు 24, ప్రభాతవార్త

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని గూడూరు రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం గూడూరు రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాత నేరస్తులు ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ కూడదని, అలా కాదని చట్టాన్ని తన చేతిలోకి తీసుకోని నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా, చట్టాన్ని అతిక్రమించి దౌర్జన్యాలకు, ఇతర ఆసాంఘీక కార్యకలాపాలకు పాల్పడిన ఉపేక్షించేది లేదన్నారు. రౌడీ షీటర్లు, పాత నేరస్తులపై నిరంతరం పోలీసు నిఘా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రెండో పట్టణ పోలీసులు, తదితరులు పాల్గొన్నారు. గూడూరు 1 టౌన్ పోలీస్ స్టేషన్‌లో సిఐ శేఖర్ బాబు, ఎస్ఐలు కలిసి రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి వారికి సమాజంలో శాంతి, భద్రతను కాపాడడంలో మంచి ఆచరణ చూపాలని సూచిస్తూ అదే విధంగా రాబోయే వినాయక చవితి ఉత్సవాల సందర్భంలో గొడవలు చేసుకున్నా, ప్రజా శాంతి, చట్ట నిబంధనలను భంగం చేయే ఏదైనా కార్యకలాపాలలో పాల్గొనకూడదని స్పష్టంగా సూచించారు.

ఏనుగు పిల్ల మృతి

కల్లూరు, ఆగస్టు 24, ప్రభాతవార్త

కల్లూరు సమీపంలో సైదల్లా గుట్ట వద్ద వారం రోజుల క్రితం ఏనుగు పిల్ల అనారోగ్యంతో మృతి చెందింది. స్థానికులు గుర్తించి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించడంతో డిఎఫ్ఓ వివేక్ వెటర్నరీ డాక్టర్ల సంఘటన స్థలానికి చేరుకొని మృతి చెందిన ఏనుగు పిల్లను కాల్చివేశారు. గత రెండు నెలల క్రితం తల్లి ఏనుగు మృతి చెందడం జరిగింది.

గణనాధుని దర్శించుకున్న కర్నాటక రాష్ట్ర హైకోర్టు జడ్జిలు

కాణిపాకం, ఆగస్టు 24 ప్రభాతవార్త:

కర్నాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సీఎం జోషి, జస్టిస్ హెపి.సందేశ్‌లు వేర్వేరుగా ఆదివారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. వారి వెంట సూపరెండెంట్ కోదండపాణి, స్థానిక ఎస్సై నరసింహులు, టెంపుల్ ఇన్స్ పెక్టర్ చిట్టిబాబు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రులకు స్వాగతం పలికిన బిజెపి శ్రేణులు

రేణిగుంట ఆగస్టు 24 ప్రభాతవార్త

కేంద్ర సాంస్కృతిక పర్యాటక ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి కిషన్ రెడ్డి,కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి శ్రీనివాస్ లకు రేణిగుంట విమానాశ్రయంలో ఆదివారం బిజెపి శ్రేణులు వేరువేరుగా ఘనంగా స్వాగతం పలికారు. వీరికి స్వాగతం పలికిన వారిలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీకాళహస్తి నియోజకవర్గం బిజెపి ఇన్చార్జి కోలా ఆనంద్ కుమార్, బిజెపి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు, జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి బీడీ బాలాజీ, జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు రమణారెడ్డి, బిజెపి మండల అధ్యక్షులు ప్రేమ్ కుమార్ రెడ్డి, బిజెపి రేణిగుంట మండల ఉపాధ్యక్షుడు మీడియా కోఆర్డినేటర్ రాజా రాయల్, సెవెన్ హిల్స్ రాము, ఆనంద్, వేణుగోపాల్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం మంత్రులు విడివిడిగా భారీ భద్రత నడుమ తిరుపతి బయలుదేరి వెళ్లారు.

పుట్టిన రోజు వేడుకల్లో మాజీ మంత్రి రోజా

విజయపురం, ఆగస్టు 24 ప్రభాతవార్త:

విజయపురం మండలంలోని మహారాజపురం గ్రామంలో వైసీపీ మండల కార్యదర్శి మహేష్, వైష్ణవి కుమారుడు ధనవీర్ పుట్టిన రోజు వేడుకల్లో మాజీ మంత్రి రోజా పాల్గొని ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో స్థానిక వైసీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మెట్లెక్కకుండానే అనుమతులు: సిఐ

కోట, ఆగస్టు 24 ప్రభాతవార్త

వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు పోలీస్ శాఖ ప్రత్యేకంగా వెబ్ సైట్‌ను ప్రారంభించిందని వాకాడు సిఐ హెస్సెన్‌బాష తెలిపారు.ఆయన ఆదివారం ప్రభాతవార్తతో మాట్లాడారు.మండపాల నిర్వాహకులు ఈ వెబ్ సైట్ ద్వారా సింగిల్ విండో విధానంలో ఎటువంటి రుసుం చెల్లించకుండా ఆన్‌లైన్‌లో అనుమతులు పొందే అవకాశం కల్పించిందన్నారు. ఇప్పటి వరకు వాకాడు సర్కిల్‌లో 99 మంది నిర్వాహకుల అనుమతి కొరకు దరఖాస్తులు చేసుకున్నారని చెప్పారు. ఇళ్లు వద్ద నుంచే నేరుగా ఆన్‌లైన్‌లో అనుమతి పొందవచ్చున్నారు. గణేష్ ఉత్సవ్ డాట్ నెట్ సైట్ తెరిచి అందులో నూతన దరఖాస్తును క్లిక్ చేయాలి. చరవాణి నంబరు నమోదు చేయగానే ఓటిపీ వస్తుంది. నమోదు చేశాక దరఖాస్తు పత్రం వస్తుంది. దరఖాస్తుదారుడి పేరు, చరవాణి నంబరు ఈమెయిల్ ,చిరునామా నమోదు చేయాలి,,విగ్రహం మండపం,ఎత్తు, ఏర్పాటు, చేస్తున్న స్థలం, పోలీస్ సబ్ డివిజన్ పోలీస్ స్టేషన్ పేరు ఉత్సవ కమిటి సభ్యుల పేర్లు, నంబర్లు, నిమజ్జనం. తేదీ, సమయం, ఏ వాహనంలో తరలిస్తారు, దరఖాస్తుదారుడి చరవాణికి గుర్తింపు సంఖ్య వస్తుంది. పోలీసులు క్షేత్ స్థాయిలో వచ్చి పరిశీలిస్తారని తెలిపారు.

నిమజ్జనానికి ముందుస్తు డ్రోన్లు వినియోగంపై అవగాహన

కోట,ఆగస్టు 24 ప్రభాతవార్త

ఈ నెల 27న జరిగే వినాయకుని పండగ పురస్కరించుకొని వివిధ గ్రామాల ప్రజల మూడు రోజులపాటు వైభవంగా ఉత్సవాల నిర్వహించుకని చివరి రోజున గణేష్ విగ్రహాలను కొత్తపట్నం పంచాయతీలోని శ్రీనివాస్‌సత్రం సముద్రంలో నిమజ్జనం జరుపుతారు. ఆక్రమంలో ముందస్తు చర్యల్లో భాగంగా ఆదివారం ఎస్ఐ .పవన్ పవన్ కుమార్ డ్రోన్లు వినియోగంపై అక్కడ ప్రజలకు అవగాహన కల్పించారు. నిఘా నీడలో డ్రోన్లు కెమెరాల ఆధారంగా అక్కడ ట్రాఫిక్ సమస్యలను తెలుసుకుని ఎప్పటికిప్పుడు సమస్యను నివారించేందకు సులువుగా ఉంటుందని అంచనా వేశారు.

మోదీ తోనే దేశాభివృద్ధి

- భారత్ వికాస్ పరిషత్ సౌతిండియా వైస్ ప్రెసిడెంట్ కంకణాల పెంచల నాయుడు

గూడూరు, ఆగస్టు 24 ప్రభాతవార్త

మన భారతదేశం ప్రధానమంత్రి నరేంద్రమోదీ 76వ సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంలో ప్రధానమంత్రి పదవిలో మార్పులు జరగవచ్చని సోషల్ మీడియా తెలియజేసిందని భారత్ వికాస్ పరిషత్ సౌతిండియా వైస్ ప్రెసిడెంట్ కంకణాల పెంచల నాయుడు అన్నారు. కానీ అది అవాస్తవం ఎట్టి పరిస్థితుల్లోనూ అలా జరగదు ప్రస్తుత పరిస్థితుల్లో అలా జరగడం మనదేశానికి మంచిది కాదు ఇప్పటి పరిస్థితుల దృష్ట్యా ఒక వైపు అమెరికా మరొక వైపు పాకిస్థాన్ వంటి శత్రు దేశాల బారి నుండి మనదేశాన్ని కాపాడుకోవడానికి ప్రధానమంత్రి గా నరేంద్రమోదీనే కొనసాగించాలని భారత్ వికాస్ పరిషత్ సౌతిండియా వైస్ ప్రెసిడెంట్ కంకణాల పెంచల నాయుడు కోరారు. అదేవిధంగా దేశంలో ఉన్న నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని ఆయన కోరారు.

కోడిపందాల స్థావరాలపై డోన్‌లతో దాడి

దొరవారి సత్రం,ఆగస్టు 24 ప్రభాతవార్త

దొరవారిసత్రం మండలం పరిధిలోని వెదురుపట్టు గ్రామ సమీపంలో కోడి పందాల స్థావరాలపై డ్రోన్లతో దాడి ఎస్ఐ అజయ్ కుమార్ మెరుపు దాడి చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో డిఎస్పి సూచనలతో రూరల్ సీఐ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 11 మంది ముద్దాయిలను, వారి దగ్గర నుండి నాలుగు కోళ్లు , ఎనిమిది మోటార్ సైకిళ్ళు మరియు 20,100 నగదును సీజ్ చేసినట్లు తెలిపారు.

కమిటీ మంచి కార్యక్రమాలు చేపడుతోంది

తిరుపతిలో కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మకు స్వాగతం

తిరుపతి,ఆగస్టు 24ప్రభాతవార్త:

రెండురోజుల తిరుమల,తిరుపతి పర్యటనలో భాగంగా ఆదివారం ఉదయం తిరుపతికి చేరుకున్న కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మకు బిజెపి నాయకులు సాదర స్వాగతం పలికారు. ఆదివారం ఉదయం బిజెపి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు గుండాల గోపీనాథరెడ్డి, పార్టీ నాయకులు తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి,వరప్రసాద్,కొండే చెంగారెడ్డి, అనూష రామకృష్ణ, డిపి ఆనంద్, మల్లారపు వాసు, గోపీప్రసాద్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం దుశ్శాలువతో సన్మానించారు. ప్రతి ఇంటా ఉన్నంతలో జరుపుకునే వినాయకచవితి పండుగకు తిరుపతిలో వరసిద్ధివినాయక మహోత్సవ కమిటీ నాయకులు ఏర్పాట్లు చేయడం బావుందన్నారు.

కుటుంబ కథా చిత్రమే సుందరకాండ..

నటుడు నారా రోహిత్.

తిరుపతి విద్య

ఆగస్టు 24 ప్రభాతవార్త:

దర్శకుడు వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వంలో రూపొందించిన సుందరకాండ కుటుంబ కథ చిత్రం అని సినీ నటుడు నారా రోహిత్ తెలిపారు.ఆదివారం సినిమా ప్రమోషన్ లో భాగంగా తిరుపతికి విచ్చేసిన ఆయన ఓ ప్రైవేట్ హోటల్లో సినీ నిర్మాత సంతోష్ చిన్నపోల్ల ,హీరోయిన్ వీర్తి వాఘాని తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27 వినాయక చవితి రోజున ఈ సినిమా విడుదల కానున్నట్లు తెలిజేశారు.ఈ చిత్రాన్ని కుటుంబ సభ్యులు వెళ్లి వీక్షించాలని సూచించారు.రొమాంటిక్ కథ చిత్రంతో లవర్ బాయ్ గా నటించాలని తెలిపారు. సినిమాలోని పాటలు తెలుగు ప్రేక్షకులకు ఇప్పటికే అలరించిందని సినిమాలో రీ ఎంట్రీ ఇచ్చిన హీరోయిన్ శ్రీదేవి నటన అందరికి నచ్చుతుందని ధీమా వ్యక్తం చేశారు.

రెండు బైకులు ఢీ: వ్యక్తి దుర్మరణం

పెళ్లకూరు ఆగస్టు 24 ప్రభాతవార్త :

మండలంలోని వడ్డి పాలెం గ్రామం వద్ద పూతలపట్టు నాయుడుపేట జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు బైకులు ఢీ కొనడంతో వడ్డి పాలెం గ్రామానికి చెందిన చమర్తి కృష్ణయ్య (38) అక్కడికక్కడే మృతి చెందాగా మరో వ్యక్తి చీరాల రోశయ్య కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని నాయుడుపేట ప్రభుత్వా సుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేస్ దర్యాప్తు చేస్తున్నారు.

భానుప్రకాశ్‌రెడ్డికి పలువురు ప్రముఖుల పరామర్శ

-అరుణమ్మ జీవితం ఆదర్శం

తిరుపతి,ఆగస్టు 24ప్రభాతవార్త:

బిజెపి రాష్ట్ర అధికారప్రతినిధి, టిటిడి బోర్డు సభ్యుడు జి,భానుప్రకాశ్‌రెడ్డిని కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, భూపతిరాజు శ్రీనివాసవర్మ పలువురు ప్రముఖులు పరామర్శించారు. భానుప్రకాశ్‌రెడ్డి తల్లి అరుణమ్మ జీవితం ఆదర్శనీయమని ప్రముఖులు పేర్కొన్నారు. ఆదివారం సాంప్రదాయంగా ఆమె కర్మకియలు జరిగాయి, ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రులతోపాటు బిజెపి సీనియర్ నాయకుడు చల్లపల్లి నరసింహారెడ్డి, తెలంగాణ బిజెపి నాయకుడు చింతల రామచంద్రరెడ్డి, పేరాల శేఖర్‌రావు, బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, మీడియా ఇన్‌ఛార్జి కిలారు దిలీప్, తిరుపతి జిల్లా బిజెపి అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, రాష్ట్రహస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ హరిప్రసాద్, టిడిపి,జనసేనపార్టీ,బిజెపి పార్టీల నాయకులు ,పలువురు హాజరయ్యారు. భానుప్రకాశ్‌రెడ్డిని ,ఆయన కుమారుడు పృథ్వీరెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు.